




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 63 | ది. 7-6-2026 | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 63 | Date : 7-6-2026 | Sunday | Pages : 8 | Rs.1/- |


## సర్వే చేస్తాం... తేడాగా ఉన్నవాళ్లను వదిలించుకుంటాం

# క్యాడర్ కు చంద్రబాబు క్లారిటీ

- పనితీరు ఆధారంగానే పార్టీలో గుర్తింపు ఉంటుందని చంద్రబాబు స్పష్టీకరణ
- తప్పులు చేసేవారిని వదిలించుకుంటానని హెచ్చరిక
- డీఎస్సీపై 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని ఆధారాలతో తిప్పికొట్టామన్న ముఖ్యమంత్రి
- లోకేష్ పట్టుదలతో పనిచేసి మంగళగిరిని టీడీపీకి కంచుకోటగా మార్చారని ప్రశంస
- ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని శ్రేణులకు సూచన



**మంగళగిరి, జూన్ 6 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీలో ఇకపై పనితీరే ప్రామాణికమని, తప్పులు చేసే వారిని, తేడాగా వ్యవహరించే వారిని వదిలించుకుంటానని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పార్టీ పదవుల నుంచి ఎన్నికల టిక్కెట్ల కేటాయింపు వరకు నిరంతరం సర్వేలు చేయిస్తానని, ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయాలు ఉంటాయని ఆయన తేల్చి చెప్పారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొని, పార్టీ భవిష్యత్ వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఇకపై పార్టీకి ఓటమి లేదు, రాదు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలతో మంచిగా ఉంటున్నాం, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నాం, సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్నాం. అన్నింటికీ మించి ఆత్మవిమర్శ చేసుకుంటున్నాం. అందుకే ఓటమి మన దరికి చేరదు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వారిని, తేడాగా ఉన్నవారిని వదిలించుకోవడానికి వెనుకాడను" అని స్పష్టం చేశారు. గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచిస్తూ, మంగళగిరి నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపారు. "మంగళగిరిలో పార్టీ గెలిచి చాలా కాలమైంది. 2019లో లోకేష్ ఓడినా పట్టు వదలకుండా పనిచేసి, 2024లో అద్భుత విజయం సాధించారు. ఇప్పుడు ఆ నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా మార్చారు. అందరూ లోకేష్‌లా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. మంచి సంకల్పంతో పనిచేస్తే దానికి తగ్గ వాతావరణం దానంతట అదే ఏర్పడుతుందని, 'ది సీక్రెట్' పుస్తకాన్ని ప్రతి కార్యకర్త చదవాలని సూచించారు.

**'గొడ్డలి పార్టీ' చేతులెత్తేసింది..** గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "మద్యపానం నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలిచ్చి 'గొడ్డలి పార్టీ' చేతులెత్తేసింది. వారు చెప్పినవి చేయకపోగా, మేం నిర్వహిస్తున్న డీఎస్సీ-2025పై బురదజల్లారు. వివేకా హత్య విషయంలో ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో, డీఎస్సీ విషయంలోనూ అదే ప్రయత్నం చేశారు. కానీ మేం ఆధారాలతో సహా కౌంటర్ ఇవ్వడంతో వారు డిఫెన్స్‌లో పడ్డారు. ఫేక్ రాజకీయాలు చేయడమే గొడ్డలి పార్టీ సిద్ధాంతం" అని ఆయన విమర్శించారు. తాము అధికారంలో ఉన్నందున సహనంతో ఉంటామని, అయితే ప్రతిపక్షం ఆగడాలు శ్రుతి మించితే సహించేది లేదని హెచ్చరించారు. కూటమి ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. "కూటమిగా వెళ్లాం కాబట్టే 94 శాతం స్ట్రైకరేట్‌తో గెలిచాం. ఓట్లు చీలకూడదనే బీజేపీతో పొత్తులో ఉన్నా టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ స్ఫూర్తిని క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కొనసాగించాలి" అని సూచించారు. "యుద్ధాన్ని గెలిపించే బాధ్యత నాది, నాతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత మీది. రాష్ట్రంలోని ప్రతి బూత్‌లో గతానికి మించి ఓట్లు రావాలి" అని శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను గడప గడపకు వెళ్లి వివరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని ప్రజలకు గుర్తు చేయాలని ఆదేశించారు.

# సమీకృత, స్వయం సమృద్ధి గ్రామాలు నిర్మించడమే ప్రధాని మోడీ లక్ష్యం

- గ్రామీణాభివృద్ధి కేంద్రం ద్వారా ఒకే చోట లభించనున్న ఆరోగ్య సంరక్షణ, విద్య, జీవనోపాధి, డిజిటల్ సేవలు
- కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్



**గుంటూరు (పి.ఐ.బి.),జూన్ 6 (వార్తాప్రభ) :** కేంద్ర కమ్యూనికేషన్లు మరియు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం నాడు నారాకోడూరు గ్రామంలో 'సమృద్ధి కేంద్రం'ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం గ్రామీణ డిజిటల్ పరివర్తనలో కీలక ఘట్టంగా నిలవనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భారత్‌నెట్ ఉద్యమి' లో భాగంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమగ్ర గ్రామీణాభివృద్ధి నమూనాను సాధించిన గ్రామాల్లో దేశంలోనే ఇది మూడవది కాగా, తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిది కావడం విశేషం. రూ. 1.16 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ సమృద్ధి కేంద్రం, 11 ముఖ్యమైన సేవా రంగాలను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చింది. దీని ద్వారా గ్రామస్తులకు ఆరోగ్యం, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సేవలు, వ్యవసాయ మద్దతు, ఉపాధి-పారిశ్రామిక అవకాశాలతో పాటు డిజిటల్ గవర్నెన్స్ సేవలు ఒకే చోట అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. డిజిటల్ శక్తితో స్వయం సమృద్ధి సాధించిన గ్రామాల నిర్మాణమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పమని, ఈ చొరవ ఆయన దార్శనికతకు నిదర్శనమని పేర్కొన్నారు. 'సమృద్ధి గ్రామ్' ప్రాజెక్ట్ ఇప్పటికే అంతర్జాతీయ గుర్తింపు పొందిందని, "ఎనేబ్లింగ్ ఎన్విరాన్‌మెంట్" విభాగంలో ప్రతిష్టాత్మక 'వరల్డ్ సమిట్ ఆన్ ది ఇన్ఫర్మేషన్ సొసైటీ అవార్డ్స్ 2026'కు నామినేట్ అయిందని వెల్లడించారు. భౌతిక మౌలిక సదుపాయాలను, హై-స్పీడ్ భారత్‌నెట్ కనెక్టివిటీతో అనుసంధానించే ఈ ప్రాజెక్ట్ విశిష్ట 'ఫిజిటల్' విధానాన్ని మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధికి ఈ నమూనా విస్తరించదగిన, అనుసరణీయమైన రోడ్‌మ్యాప్‌ను అందిస్తుందని అన్నారు. .

**వికసిత్ భారత్ 2047 దిశగా..** సమృద్ధి కేంద్రాన్ని భవిష్యత్తు తరాల కోసం పెట్టిన పెట్టుబడిగా అభివర్ణించిన డాక్టర్ పెమ్మసాని.. ఇది కేవలం ఒక సేవా కేంద్రం మాత్రమే కాదని, గ్రామీణ సాధికారత, ఆవిష్కరణలు, స్థిరమైన వృద్ధికి బలమైన వేదికని అభివర్ణించారు. "భారత్ ఉదయ్ ద్వారా గ్రామోదయం" అనే దార్శనికతతో, నారా కోడూరులో ప్రారంభమైన ఈ ప్రయాణం 'వికసిత్ భారత్ 2047' స్వప్నాన్ని సాకారం చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగు అని అన్నారు.
ఈ సరికొత్త నమూనాపై పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి పెమ్మసాని, నారా కోడూరులో వెలిగిన ఈ జ్యోతి ఆంధ్రప్రదేశ్, దేశవ్యాప్తంగా ఉన్న వేలాది గ్రామాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో సాధికారత సాధించిన గ్రామీణ సమాజాలు, సమగ్ర, స్థిరమైన అభివృద్ధిని ఏ విధంగా నడిపించగలవో ఈ కేంద్రం నిరూపిస్తుందని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, టెలికమ్యూనికేషన్స్ డైరెక్టర్ జనరల్ అతుల్ సిన్హా, టెలికమ్యూనికేషన్స్ డైరెక్టర్ అతీక్ అహ్మద్, జెడ్పీ సీఈఓ వీర్ల జ్యోతిబసు,జిల్లా, మండల స్థాయి అధికారులు ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ల శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, నారాకోడూరు గ్రామస్థులు పాల్గొన్నారు.






# మాస్కోలో టీచర్లు లేని వినూత్నమైన భవిష్యత్ పాఠశాల

- స్కూల్ 21 ను సందర్శించిన ఏపీ విద్యామంత్రి నారా లోకేష్
- తోటి విద్యార్థులే అధ్యాపకులు...ప్రాజెక్టు ఆధారిత పాఠాలు



**మాస్కో,జూన్ 6 (వార్తాప్రభ) :** మాస్కోలో స్బేర్ ఆధ్వర్యంలో నడుస్తున్న విభిన్నమైన పాఠశాల స్కూల్ 21ను ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. సాంప్రదాయ విద్యావిధానానికి భిన్నంగా అక్కడ అనుసరిస్తున్న విధానాలను నిర్వాహకులు, విద్యార్థుల ద్వారా ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. స్కూల్ 21 అనేది రష్యాలో స్బేర్‌బ్యాంక్ ప్రారంభించిన ఉచిత ప్రోగ్రామింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ విద్యా కార్యక్రమం. ఇక్కడ విద్యార్థుల నుంచి ఎటువంటి ట్యూషన్ ఫీజు వసూలు చేయరు. ఇది ఇంటర్నేషనల్ 42 నెట్‌వర్క్‌లో సభ్యత్వం కలిగి, స్వతంత్రంగా పనిచేస్తుంది, ఫ్రెంచ్ కోడింగ్ స్కూల్ అయిన ఎకోల్ 42 రూపొందించిన వినూత్నమైన "భవిష్యత్ పాఠశాల" విద్యా పద్ధతులను అనుసరిస్తుంది. స్కూల్ 21లో ప్రవేశం కోసం ఎంపిక ప్రక్రియ వినూత్నంగా, విభిన్నంగా ఉంటుంది. గత విద్యా ప్రతిభ, డిగ్రీలు లేదా ముందస్తు కోడింగ్ పరిజ్ఞానాన్ని ఇక్కడ పరిగణనలోకి తీసుకోరు. సాధారణ నమోదుకు ముందు దరఖాస్తుదారులు ఆన్‌లైన్ కాగ్నిటివ్ పరీక్షను పూర్తి చేయాలి. దాని తర్వాత, సమస్య పరిష్కార నైపుణ్యాలను, అనుకూలతలను అంచనా వేయడానికి "పిసిన్" (స్విమ్మింగ్ పూల్) అని పిలువబడే, అనేక వారాల పాటు జరిగే ఒక ఇంటెన్సివ్ ఆన్-సైట్ ఎంపిక శిబిరంలో పాల్గొనాలి. అక్కడ వారు ఇచ్చిన టాస్క్ లపై ప్రత్యక్షంగా ప్రదర్శించిన తెలివితేటలను బట్టి ఎంపిక ప్రక్రియ ఉంటుంది.








## వామ్మో.. ప్రైవేట్ దోపిడి...!

- మైలవరం పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థలు నిలువు దోపిడి
- స్కూల్లోనే పుస్తకాలు కొనాలని పేరెంట్స్ ని ఒత్తిడి చేస్తున్న పాఠశాలల యాజమాన్యాలు
- పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల స్టాల్స్ ఏర్పాటు
- విద్యాశాఖ అధికారులు అమ్ముడు పోయారంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

- 8లో

## పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణి



**కృత్తివెన్ను,జూన్ 6 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం లో ని ఈ నెల 12 వ తేదీ నుండి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న దృష్ట్యా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నూతన విద్యా సంవత్స రానికి సంబంధించిన అన్ని తరగతుల పాఠ్యపుస్తకాలను అందించడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి ఎస్ కే డి వి ప్రసాద్ రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. పాఠ్య పుస్తకాలతో పాటు ఇంగ్లీష్ డిక్షనరీలు మరియు విద్యార్థులు సంసిద్ధతా పుస్తకాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్.ఏడుకొండలు, ఉండి.పురుషోత్తం ఆర్ పట్టాభి రామయ్య జే ఎం సుందర్రావు మహమ్మద్ మున్వార్ శంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెడన గ్రంథాలయం లో ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



**పెడన,జూన్ 6 (వార్తాప్రభ) :** పెడన శాఖా గ్రంథాలయం నందు గత 40 రోజులుగా నిర్వహించబడుతున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విద్యార్థిని విద్యార్థులు అతిథులు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బర్ల మల్లికార్జున్ ప్రసాద్ పట్టణ ప్రముఖులు వార్డ్ టీడీపీ ఇంచార్జ్ వాహబ్ ఖాన్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ మెంబర్స్ వేముల రమేష్ కట్టా గణేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ క్రమశిక్షణ తో చదువు కోవాలని కోరారు. ఈ కార్యక్రమం లొ ప్రతి రోజు హాజరైన విద్యార్థుల కు అతిథులతో బహుమతి ప్రధానం చేయడమైనది. అనంతరం విద్యార్థులు అతిథులతో సమ్మర్ క్యాంపు కేక్ కట్ చేయడమైనది. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ వారిచే సరఫరా చేయబడిన ప్రశంస పత్రాలు వారిచే బహుమతులు అందజేశారు. నిర్వాహకుడు షేక్ కలేషా శాఖ గ్రంథాలయం అధికారి పెడన వందన సమర్పణ చేసారు .

## వేదిక ఒకటే జన్మదినోత్సవ సంబరాలు రెండు



**విస్సన్నపేట,జూన్ 6 (వార్తాప్రభ) :** స్థానిక మండల వైసీపీ కార్యాలయం కేంద్రంలో ఒకే వేదికపై రెండు జన్మ దినోత్సవ ఉత్సవ మహోత్సవ వేడుకలను వైసీపీ శ్రేణులు నిర్వహించారు. మరిన్ని వివరాలలోకి వెళితే జడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, సోషల్ మీడియా పట్టణ ఇంచార్జ్ గంజినబోయిన సీతారామయ్యల జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా వైసీపీ పార్టీ పెద్దలు రెండు కేకులతో పాటు కట్ చేసి ఇద్దరికి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టు శాలువాలతో సుగంధ పరిమళాలు వెదజల్లే పూలదండలతో పుష్పగుచ్చలతో ఘనంగా సత్కరించారు.

## బల్లిపర్రు లో నవచేతన యాప్ స్క్రీనింగ్ ట్రైనింగ్




**పెడన,జూన్ 6 (వార్తాప్రభ) :** పెడన మండలస్థాయి నవచేతన యాప్ స్క్రీనింగ్ ట్రైనింగ్ రెండవ రోజు బల్లిపర్రు గ్రామంలోని హైస్కూల్ లో శనివారం జరిగింది.బంటుమిల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రాజెక్టు సిడిపిఓ సముద్రవేణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీడీపీఓ తో పాటు సెక్టార్ సూపర్వైజర్లు పిట్ల కల్పవల్లి గోపి వెంకటేశ్వరమ్మ లు అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. యాప్ పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో చేవేంద్రపాలెం పెడన పిహెచ్సి ఎం ఎల్ హెచ్ వో లు ఎమిలి సుజాత అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు

## బీసీ చైతన్య సమితి బందరు నియోజకవర్గ అధ్యక్షునిగా బోయిన నాగరాజు



**మచిలీపట్నం,జూన్ 6 (వార్తాప్రభ) :** బీసీ చైతన్య సమితి బందరు నియోజకవర్గ అధ్యక్షునిగా బోయిన నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు సమితి జాతీయ అధ్యక్షుడు బిసి రమణశుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆదివారం నాడు విజయ వాడలో నాగరాజు బాధ్యతలు స్వీకరించనున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో నాగరాజు యాక్టివ్ గా ఉంటున్నారు. ముఖ్యంగా యాదవ సేన ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పెడన నియోజకవర్గం యాదవ సేన కు సంబంధించి ఆర్థిక వ్యవహారాలను చూస్తున్నారు. నాగరాజు నియామకం పట్ల యాదవ ప్రతినిధి కొలుసు చందు యాదవ్ తో పాటు పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేసారు.

# టిడ్కో బాధితులకు ఊరట.. రూ.6.53 కోట్ల మెగా చెక్ పంపిణీ



**కాకినాడ,జూన్ 6 (వార్తాప్రభ) :** కాకినాడ అర్బన్ పరిధిలో టిడ్కో ఇళ్ల కోసం డబ్బులు చెల్లించి కూడా గృహాలు పొందలేకపోయిన లబ్ధిదారులకు వారి సొమ్మును తిరిగి చెల్లించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుమతితో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు శనివారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో రూ.6..53 కోట్ల మెగా చెక్కును బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ 2014-19 మధ్యకాలంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు నగర పరిధిలోనే గృహాలు అందించాలనే లక్ష్యంతో పోర్టు అధికారుల సహకారంతో కాకినాడలో 4,554 టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అందులో 1,150 డబుల్ బెడ్రూమ్, 904 సింగిల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లు పేర్కొన్నారు. అయితే 2019లో ప్రభుత్వం మారిన తర్వాత టిడ్కో గృహాల నిర్మాణం, పంపిణీ ప్రక్రియలో జాప్యం ఏర్పడటంతో లాటరీల్లో ఎంపికైన పలువురు లబ్ధిదారులు కూడా ఇళ్లు పొందలేకపోయారని ఆయన తెలిపారు. ఇల్లు వస్తుందనే ఆశతో తమ పొదుపు సొమ్మును చెల్లించిన కుటుంబాలు ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చిందన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్లో టిడ్కో బాధితుల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో ఇళ్లు రాని వారికి వారు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించే ప్రక్రియకు మార్గం సుగమమైందని వెల్లడించారు. కాకినాడ నగరంలో 739 మంది లబ్ధిదారులకు 6.53 కోట్లను చెక్కు రూపంలో అందజేసినట్లు వెల్లడించారు. టిడ్కో సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని,మిగిలిన బాధితులకు కూడా న్యాయం జరిగేలా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ,నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, టీపీఆర్వో శైలజ, మెప్మా సి ఎం ఎం.రాజు, గదుల సాయిబాబా, అధికారులు పాల్గొన్నారు.

# చీపురు పట్టి శుభ్రం చేసిన ఎమ్మెల్యే





**తిరువూరు,జూన్ 6 (వార్తాప్రభ) :** తిరువూరు పట్టణంలోని రైతు బజారులో మూడో వారం నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివా సరావుపాల్గొన్నారు ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం ద్వారా తిరువూరు పట్టణంలో పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యత కల్పిస్తూ స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని ప్రజలకు అందించడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నామ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు.ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా చెత్త నిల్వ ఉండకూడదని, పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతు బజారు ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పారిశుద్ధ్యం, పరిశుభ్రత నిర్వహణ, వ్యర్థాల తొలగింపు, డ్రైనేజీ నిర్వహణ వంటి అంశాలను స్వయంగా తనిఖీ చేసి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులు, వ్యాపారులు మరియువినియోగదారులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.అనంతరం రైతు బజారులోని పలు దుకాణాలను సందర్శించి కూరగాయల సరఫరా, ధరలు, నాణ్యత, నిల్వ సదుపాయాలు మరియు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వ్యాపారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందుబాటు ధరల్లో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా అక్కపాలెం గ్రామానికి చెందిన రైతు బజారు దుకాణ యజమాని శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు శాలువాతో సత్కరించారు. అక్కపాలెం రహదారి 10 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కొలికపూడి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో రోడ్డు నిర్మాణం చేపట్టించి గ్రామ ప్రజల సమస్యను పరిష్కరించారని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలియజేశారు.అదేవిధంగా రైతు బజారులో ఏర్పాటు చేసిన ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ ను సందర్శించి తాగునీటి సరఫరా పరిస్థితులను పరిశీలించారు. ప్లాంట్ నిర్వహణ, నీటి నాణ్యత, ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకొని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.రైతు బజారుకు వచ్చే రైతులు, వ్యాపారులు మరియు వినియోగదారులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు బజారు నిర్వాహకులు, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి..

### -విశ్రాంత న్యాయమూర్తి పి జయ బాబు.



**గన్నవరం, జూన్ 6 (వార్తాప్రభ) :** గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకో వాలని విశ్రాంత న్యాయమూర్తి పి జయ బాబు ఈరోజు ముస్తాబాద శాఖ గ్రంథాలయం నందు జరిగిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమములో ముఖ్యఅతిథిగా పాల్గొంటూ పేర్కొన్నారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు షేక్ ఇమామ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మేమందరము కూడా ఖాళీ సమయంలో ఈ గ్రంథాలయమునకు వచ్చి వివిధ పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని సమకూర్చుకొని ఈరోజు ఉన్నత శిఖరాలు చేరుకున్నామని అదేవిధంగా మీరందరూ కూడా రోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలతో పాటు ఇంటర్నెట్ సౌకర్యం కలిగిన టువంటి కంప్యూటర్స్ టీవీ మొదలగునవి ఉన్నాయి కనుక వాటిని సద్వినియోగం చేసుకోవలసిందిగా విద్యార్థిని విద్యార్థులను కోరారు. గ్రామ పెద్దలు పాలడుగు మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రామంలో ఉన్న ఈ గ్రంథాలయాన్ని కావడం అలవాటుగా చేసుకో వాలని 40 రోజులపాటు ఈ కార్యక్రమాలు నిర్వహించిన లైబ్రరియన్ జ్యోతి కుమారిని అభినందించారు. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ చిన్నతనం నుండి మేమందరము ఈ గ్రంథాలయం నాకు వచ్చి ఇక్కడ పేపర్లు పుస్తకాలు చదివే వాళ్ళమని మీరు కూడా అలాగే గ్రంథాలయానికి వచ్చి ఇక్కడ ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకుని విజ్ఞానాన్ని సంపాదించాలని విద్యార్థిని విద్యార్థులను కోరారు. 40 రోజులపాటు శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు ఈ 40 రోజులలో తాము నేర్చుకున్న అంశాలను గురించి సభకు వివరించారు. ఈ 40 రోజులపాటు వివిధ కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో లైబ్రేరియన్ జ్యోతి కుమారి, కళ్యాణి, కృష్ణకుమారి విద్యార్థిని విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం 45 రోజుల వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థిని విద్యార్థులకు అందజేయడం జరిగింది.

## సత్యం మాస్టారుకు మరో సత్కారానికి ఆహ్వానం..



**పెనుగంచిప్రోలు, జూన్ 6 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలుకు చెందిన ఉపాధ్యాయ రచయిత ముక్కా సత్యనారాయణను మరో బిరుదు పురస్కారం వరించింది. స్థానిక స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సత్యనారాయణ కుసుమ ధర్మన్న కళా పీఠం సమూహములో నూట ఎనిమిది పద్యాలను రాసిన సందర్భంగా శతక పద్యరత్న బిరుదు ప్రధానం చేయడం జరిగింది. వివిధ అంశాలపై గత రెండు నెలలుగా ఈ రచనలు చేసిన ట్లు సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను నిర్వాహ కులు కుసుమ రాధ, మునిమడుగు శాంతలక్ష్మి, రచయితలు, ఉపాధ్యా యులు అభినందించారు. రవీంద్రభారతిలో మహతి కవి విభూషణ బిరుదు పురస్కారంతో చేసే సన్మానం అందుకొనవలసిందిగా సంస్థ అధ్యక్షులు అడిగొప్పుల సదయ్య సత్యనారాయణకు ఆహ్వానం పంపారు.

## వేసవి శిక్షణా తరగతులు ముగింపు..



**హనుమాన్ జంక్షన్,జూన్ 6 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం వీరవల్లి గ్రంథాలయం లో నిర్వహించిన వేసవి శిక్షణా తరగతులు నేటితో ముగిసాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ ప్రత్యేక అధికారి కె సంపత్ కుమార్ , టిడిపి రాష్ట్ర నాయకులు గుండపనేని ఉమా వరప్రసాద్, మాజీ ఉప సర్పంచి లంక అజయ్, జిల్లా తెలుగు యువత కార్యదర్శి మండాది రవీంద్ర, గ్రంథాలయ అధికారి భారతి పాల్గొన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ వేసవి శిక్షణా తరగతులు పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. వేసవి సెలవులను వృధా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోనేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చక్కటి ఆలోచనతో వేసవి శిక్షణా తరగతులు నిర్వహించారని తెలిపారు. ప్రధానంగా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, ఏకాగ్రతను పెంపొందించేలా చిత్రలేఖనం (డ్రాయింగ్), పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, కథలు చదవడం, క్విజ్, డాన్స్, చదరంగం (చెస్), యోగా, జనరల్ నాలెడ్జ్. లాంటి వాటిపై శిక్షణా ఇవ్వడం ద్వారా భవిష్యత్తు పునాదికి చక్కటి బాసటగా నిలుస్తోందని అభివర్ణించారు. వేసవి శిక్షణా తరగతుల ముఖ్య ఉద్దేశం పిల్లలు ఎక్కువగా పుస్తకాలు చదవడం, మననం చేసుకోవడం ద్వారా జ్ఞాపకశక్తి మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు.

## భోజన పదార్థాలు పరిశీలించిన కమిషనర్ మనోజ



**తిరువూరు,జూన్ 6 (వార్తాప్రభ) :** తిరువూరు అన్నా క్యాంటీన్ ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ కే మనోజ ఆమె భోజనం పదార్థాలను పరిశీలించింది అన్నా క్యాంటీన్లో భోజనం చేయటానికి వచ్చిన వారికి ఆమెస్వయంగా వడ్డించారు ఆమె సిబ్బందితో మాట్లాడుతూ ప్రతిరోజు అన్నక్యాంటీన్ పరిసర ప్రదేశాలు పరిశుభ్రంగా ఉంచాలి భోజనం చేయుటకు వచ్చిన వారు ఎడల సిబ్బంది స్నేహపూర్వకంగా ఉండాలి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఐదు రూపాయలకే భోజన సదుపాయాలు కల్పించింది అని ఆమె తెలిపారు

# గ్యాస్ ఉత్పత్తిలో 50 శాతం వాటా రాష్ట్రానికి ఇవ్వాలని అసెంబ్లీ తీర్మానం చేయాలి

● నేతలు పొదుపు షోలు కట్టి పెట్టండి ● 9న ఆందోళనలు ● వామ పక్ష నేతలు వెల్లడి



**కాకినాడ, జూన్ 6 (వార్తాప్రభ) :** కృష్ణ గోదావరి బేసిన్లో ఉత్పత్తి అవుతున్న సహజవాయువుని రిలయన్స్ కంపెనీ ఎక్కడ నుంచి తరలించుకుని పోతున్న నేపథ్యంలో ఉత్పత్తిలో 50 శాతం వాత రాష్ట్రానికి ఇవ్వాల్సిందే అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు గాడిమొగ రిలయన్స్ కేజీ బేసిన్ ప్రాంతంలో శనివారం వామపక్ష పార్టీల నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా కాకినాడలోని సుందరిభవన్లో విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ గత రెండు నెలలుగా రాష్ట్రంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ తీవ్రమైన సంక్షోభం ఏర్పడిందన్నారు. ఈ సంక్షోభానికి మూడు కారణాలున్నాయన్నారు. అంతర్జాతీయంగా అమెరికా ఒత్తిడికి లొంగి ఇరాన్, రష్యా వద్ద ఆయిల్, గ్యాస్, కొనకుండా అమెరికా కంపెనీల వద్ద అధిక ధరలకు కొనడం వల్ల మనం తీవ్రంగా నష్టపోతున్నామన్నారు.యుద్ధం పేరు చెప్పి ధరలను పెంచాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. మన రాష్ట్రంలో కూడా సరిపడా నిల్వలు లేవన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన 15 రోజులకు మించి నిల్వ లేదని, దీనిని ఆసరాగా చేసుకుని రిలయన్స్ వంటి సంస్థలు ఇష్టారాజ్యంగా ధరలను పెంచడంతో మరింత సంక్షోభం మొదలైందన్నారు. మన రాష్ట్రంలో కృష్ణా గోదావరి బేసిన్ లో ఉండే ఆయిల్, గ్యాస్ ను 2006 లో కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ప్రజాభిప్రాయం లెక్క చేయకుండా మన రాష్ట్ర ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నా నాడు రిలయన్స్ కంపెనీకి కేటాయించిందన్నారు. ఇక్కడ బావులు తవ్వి పైప్ లైన్ ద్వారా మన రాష్ట్రానికి, దేశానికి ఇవ్వకుండా నేరుగా గుజరాత్, మహారాష్ట్రకు తరలించి అక్కడ నుంచి దేశ దేశాలకి అమ్ముకునే విపరీతమైన లాభాలను ఆర్జిస్తుందన్నారు. అంతర్జాతీయ ధర్లకంటే అధికంగా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో స్థానికంగా తయారయ్యే గ్యాస్ ఆయిల్ లో 50 శాతం ఆంధ్రప్రదేశ్ కు వాటా ఇవ్వాలని 12వ ఫైనాన్స్ కమిషన్ సిఫార్సు చేసిందని గుర్తు చేశారు. 50 శాతం ఇస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరుగుతుందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా చెప్పిందన్నారు. రాష్ట్ర ప్రజలకు తక్కువగా ఇవ్వడమే కాకుండా రేటు, ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. నాటి లెక్కల్లో 5 వేల కోట్లు మిగులుతుందని, ఇప్పుడు, లెక్కల్లో అయితే 10 వేల కోట్లు ఉంటుందన్నారు. రోజుకి 21 వేల మిలియన్ మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉత్పత్తి జరుగుతుండగా అందులో మన రాష్ట్ర అవసరాలకి 4 వేల టన్నులు సరిపోతుందని తెలిపారు. దీనిని పైపులైన్ ద్వారా లేదా సిలిండర్ల ద్వారా ఇస్తే 200 రూపాయలకే గ్యాస్ ఇవ్వచ్చు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరు కారణంగా నేడు సంక్షోభం నేపథ్యంలో చిన్నచిన్న హోటల్లు టిఫిన్ సెంటర్లు మూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, నిరుద్యోగులు వీధుల్లో పడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఒక టిఫిన్ సెంటర్ మూతపడితే నాలుగైదు కుటుంబాలు వీధిలో పడుతున్నాయన్నారు. దీనితోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం రూ.10 వేల కోట్లు పడిపోతుందన్నారు. మన వాటా గనుక మనకు వస్తే అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండదన్నారు. ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. ఈ సొమ్మును అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. మన సంపదను రిలయన్స్ దోచుకుంటూ ఉంటే నేడు ఆ కంపెనీ కాళ్లు, వేళ్ళు పట్టుకుని పెట్టుబడులు పెట్టండి, ఉద్యోగాలు ఇవ్వండని వేడుకునే పరిస్థితి దాపురించిందన్నారు. ఈ ప్రాంతంలో లక్ష కోట్లు పెట్టుబడులు పెట్టి 50 వేలు ఉద్యోగాలు ఇస్తామని రిలయన్స్ ప్రకటించిందని, అయితే ఇప్పుడు సుమారు 3 వేల ఉద్యోగాలు మించి ఇవ్వలేదన్నారు. ఓఎన్జిసి సంస్థ ఈ ప్రాంతానికి సిఎస్సార్ నిధులను కేటాయించి పలు గ్రామాల అభివృద్ధికి తోడ్పడుతుందని, అయితే రిలయన్స్ ఈ ప్రాంత అభివృద్ధికి ఒక పైసా కూడా ఖర్చు పెట్టలేక పోతుందని విమర్శించారు. అరకొర సిఎస్ఆర్ నిధులను కేటాయించి చేతులు దులుపుకోవడం శోచనీయమన్నారు. పైగా రిలయన్స్ కార్యకలాపాల వలన కాలుష్యం విపరీతంగా పెరుగుతుందని ఎప్పుడు, ఎక్కడ పేలుతుందో తెలియక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. పంటలకు విపరీతంగా నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవికాలంలో త్రాగునీళ్లు కూడా కాలుష్యం అవుతున్నాయని, కొన్ని గ్రామాలలో తాము ప్రత్యక్షంగా పరిశీలించామన్నారు. ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేకపోగా ఇన్ని వేల కోట్ల రూపాయలు లాభాలు తీసుకెళ్తూ స్థానికంగా అభివృద్ధికి తోడ్పడని కంపెనీకి ప్రభుత్వాలు ఎందుకు మద్దతిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. మనకు న్యాయంగా దక్కాల్సిన 50 శాతం గ్యాస్ ను ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం అడిగి తీసుకోవడం లేదన్నారు. మన సంపదను వాళ్లకు వదిలేస్తే రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందని వామపక్షాల తరఫున ప్రశ్నిస్తున్నామన్నారు. ప్రజలను మభ్యపెట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా సైకిల్ తొక్కితే ఆరోగ్యం అని ప్రభుత్వ పెద్దలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఏదో ఒక గంట సైకిల్ తొక్కితే సమస్య పరిష్కారం అయిపోతుందా అని ప్రశ్నించారు. ఇటువంటి షోలు వల్ల పెట్రోలు, డీజిల్, గ్యాస్ సమస్య పరిష్కారం కాదన్నారు. మన రాష్ట్ర సంపదను మన హక్కుగా రావాల్సిన వాటా కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి కేంద్రంతో పోరాడాలని డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే ఇంధన, గ్యాస్ ధరలు తగ్గడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. దానివల్ల అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని, ప్రజలపై భారాల వేయాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ నేపథ్యంలో ఈ సమస్యలన్నింటికైనా ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో రాస్తారోకోలు నిర్వహిస్తున్నామని దీనిని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మధు, సిపిఐ (యంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు పి ప్రసాద్, సిపిఐ(యంఎల్) రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్ బాబు, సిపిఐ (యంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ కేజీ బేసిన్లో రిలయన్స్ చేస్తున్న దోపిడీపై ఇప్పటికే వామపక్షాల ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ప్రచారం చేస్తున్నామన్నారు. రౌండ్ టేబుల్ సమావేశాలు జరిపామన్నారు. కాకినాడకు సమీపంలో ఉన్న కేజీబేసిన్ లో రిలయన్స్ దోపిడీపై మరింత విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. మన వాటా మనకు గనక దక్కితే సంక్షేమ పథకాలను అమలు చేయవచ్చునని చెప్పారు. సంపద సృష్టిస్తున్నామని చెబుతున్న సీఎం రిలయన్స్ దోపిడీపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సహజ సంపదను లూటీ చేస్తున్న అంబానీకు వత్తాసు పలకడం సరికాదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిసిఎం పవన్ కళ్యాణ్ దోపిడీపై ప్రశ్నించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే ఐక్య కార్యచరణ ద్వారా ఆందోళనలు ఉధృతం చేస్తున్నామన్నారు. పొలిటికల్ టెర్రరిజం కంటే ఎకనామిక్ టెర్రరిజం ప్రమాదకరమన్నారు. తక్షణమే అసెంబ్లీని సమావేశపరిచి మన వాటా కోసం డిమాండ్ చేయాలన్నారు. సహజ వనరులను కొల్లగొడుతున్న రిలయన్స్ దోపిడీపై యువత కూడా పోరాడాలన్నారు. పెట్రోల్, డీజిల్ 80 శాతం, గ్యాస్ 60 శాతం దిగుమతి చేసుకునే దుస్థితి నుంచి బయటపడాలన్నారు. పెట్టుబడిదారులకు రెడ్ కార్పొరేట్ పరిచి వాళ్ళ ప్రయోజనాల కోసమే పాలకులు పనిచేస్తుండడం శోచనీయమన్నారు. రిలయన్స్ గ్యాస్ అక్రమ తరలింపును అడ్డుకోవాలని కేంద్రానికి అనేకసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఏపీలో సహజ వనరులను ఓఎన్జిసి గుర్తించగా తరలించిపోతున్న రిలయన్స్ మనకు వాటా ఇవ్వకపోవడం దారుణం అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎవి నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా నాయకులు తోకల ప్రసాద్, సిపిఐ (యంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు జె వెంకటేశ్వర్లు, సిపిఐ(యంఎల్) జిల్లా నాయకులు సి నాగేశ్వరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, జిల్లా నాయకులు దువ్వ శేషబాబ్జి, జి బేబీ రాణి, కేఎస్ శ్రీనివాస్, ఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 8న సి.ఎం. రేవంత్ రాక

## ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ



**శేరిలింగంపల్లి,జూన్ 6 (వార్తాప్రభ):** మియాపూర్ చౌరస్తా నుంచి ఆల్విన్ కాలనీ వరకు రూ.530 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఫ్లైఓవర్, అండర్‌పాస్‌లతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ప్రధాన కార్యాలయం తదితర అభివృద్ధి పనులకు ఈ నెల 8న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యం లో సభా ప్రాంగణం ఏర్పాట్లను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సుమారు రూ.2 వేల కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.మియాపూర్ ఫ్లైఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.కార్యక్రమానికి ప్రజలు, నాయకులు,కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అన్నమా స్వరార్చన లో ఆకట్టుకున్న కూచిపూడి నర్తకి సుధా నృత్య ప్రదర్శన



**శేరిలింగంపల్లి,జూన్ 6 (వార్తాప్రభ) :** మాదాపూర్ అన్నమయ్య పురంలో శనివారం నిర్వహించిన అన్నమ స్వరార్చన కార్యక్రమంలో కూచిపూడి నర్తకి జి.సుధా నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకటుకుంది.పద్మశ్రీ డా.శోభారాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముం దుగా అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం,లక్ష్మీ అష్టోత్తర శతనామా వళి,అన్నమయ్య అష్టోత్తరం నిర్వహించారు.గురువులు పసుమర్తి రత్తయ్య శర్మ, లక్ష్మి గోవర్ధనన్ శిక్షణలో నైపుణ్యం సాధించిన సుధా 'సకల గణాధిప', 'దశావతార శబ్దం', 'మండోదరి శబ్దం' నృత్యాంశాలను ప్రదర్శించారు. భావ,రాగ,లయ ,అభినయాలతో కూడిన ఆమె ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ముఖ్యంగా దశావతార శబ్దం,మండోదరి శబ్దంలో ఆమె అభినయం ప్రశంసలు అందుకుంది.ఈ సందర్భంగా డా.శోభారాజు అన్నమయ్య సంకీర్తన భావార్థాన్ని వివరించి కళాకారిణిని అభినందించారు.అనంతరం అన్నమాచార్య భావనా వాహిని ప్రతినిధులు సుధాను జ్ఞాపికతో సత్కరించారు.మంగళహారతి, ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.

# ఓటర్ జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించండి

**అర్హులైన ఓటర్లకు అవగాహన కల్పించండి**
**బిజెపి శ్రేణులకు నాయకుల దశ నిర్దేశం.**



**శేరిలింగంపల్లి,జూన్ 6 (వార్తాప్రభ):** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంజినీర్ ఎన్‌క్లేవ్‌లో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం,ఎస్ఐఆర్ అంశంపై ముఖ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి బీజేపీ ఎస్ఐఆర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్న వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ అజిత్ కుమార్ సేనాపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మాణిక్‌రావు హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్ఏ-2లు, పార్టీ కార్యకర్తలు ఎస్ఐఆర్ అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఓటరు జాబితాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి,బీఎల్‌వో అధికారులతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన ఓటర్లకు అవగాహన కల్పించాలని తెలిపారు.రానున్న ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితాల్లో ఎలాంటి తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్, మహిళా మోర్చా, యువ మోర్చా,ఓబీసీ మోర్చా నాయకులు,శక్తికేంద్ర ఇన్‌చార్జీలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ప్రైవేట్ స్కూల్లో ఫీజు రాయితీ కల్పించాలి.

**టిడబ్ల్యూజెఎఫ్ మేడ్చల్ నియోజకవర్గం కన్వీనర్ అంబాల విష్ణు**



**జవహర్ నగర్, జూన్ 6:(వార్తా ప్రభ)** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూ జేఎఫ్) మేడ్చల్ నియోజక వర్గం కన్వీనర్ అంబాల విష్ణు ఈ సందర్భంగా మాటాడుతూ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు రాయతీలకు సంబంధించిన. ప్రభుత్వ ఉత్తర్యులకు అమలు చేయాలని కోరారు.

# నోటి కంట్రోల్... లైఫ్ సూపర్ కూల్!!

● టాక్ లిమిట్... బాండ్స్ అన్‌లిమిటెడ్ ● మాటల్లో, తిండిలో బ్యాలెన్స్ ● ఈట్ రైట్.. ఫీల్ లైట్ ● మైండ్‌ఫుల్ ఈటింగ్... హెల్దీ లివింగ్ ● నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది ● ఈ నానుడి నిజమే కదా బాసు ● పెద్దల మాటలు ఓల్డ్ ఫ్యాషన్ కాదు... గోల్డెన్ గైడెన్స్! ● "వార్తాప్రభ" అందిస్తున్న జీవిత సత్యం చదివేయండి.... ● అలాగే కొంతలో కొంత ఫాలో అవ్వండి




**పెద్దపల్లి/గోదావరిఖని, జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది. చిన్నప్పుడు అమ్మమ్మలు, తాతయ్యలు పదే పదే చెప్పిన ఈ ముక్క వెనుక ఎంత నిగూఢమైన సత్యం ఉందో కదా! కానీ, ఇవాళ్టి మన 2జీ,3జీ,4జీ,5+ స్పీడు జీవితంలో ఆ నిదానం ఎక్కడో తప్పిపోతోంది. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఏదో తెలియని పరుగు. ఆ పరుగులో మనం ఏం మాట్లాడుతున్నామో, ఏం తింటున్నామో గమనించే టైమే ఉండట్లేదు.కాస్త ఆలోచించండి... మన లైఫ్‌ను హ్యాపీగా, పీస్‌ఫుల్‌గా మార్చుకోవడానికి పెద్దగా కష్టపడక్కర్లేదు. కేవలం మన నోటినిఅదుపులో పెట్టుకుంటే చాలు. అది తినడంలో అయినా, మాట్లాడటంలో అయినా!!

**మాటల్లో కంట్రోల్ హార్ట్ ఫుల్ కనెక్షన్స్** ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికీ స్ట్రెస్ ఎక్కువే. బాస్ మీద కోపమో, ట్రాఫిక్ వల్ల వచ్చిన చిరాకో... ఇంట్లో వాళ్ల మీదో లేదా కొలీగ్స్ మీదో చూపించేస్తుంటాం. అనరాని మాట అనేసి, ఆ తర్వాత సారీ బాస్, ఫ్లోలో వచ్చేసింది అంటే పోయిన బంధాలు తిరిగి వస్తాయా?

**స్మార్ట్ టిప్** ఎవరైనా మిమ్మల్ని కోప్పెట్టేలా మాట్లాడితే... వెంటనే రియాక్ట్ అవ్వకండి. ఒక్క క్షణం గ్యాప్ ఇచ్చి, ఒక దీర్ఘ శ్వాస తీసుకోండి. మౌనం కంటే పవర్ ఫుల్ వెపన్ మరొకటి లేదు. మనం మాట్లాడే ప్రతి మాట ఒకరి మనసును గాయపరిచేలా కాకుండా, గాయాన్ని మాన్పేలా ఉండాలి. మన మాటల్లో వైబ్స్ ఎప్పుడూ పాజిటివ్‌గా ఉండేలా చూసుకుందాం.

**తినడంలో కంట్రోల్ మైండ్‌ఫుల్ ఈటింగ్** ఇక రెండోది... తిండి! వీకెండ్ వస్తే చాలు 'చీట్ డే' పేరుతో జంక్ ఫుడ్‌పై పడిపోతాం. రీల్స్ చూస్తూ, టీవీ చూస్తూ ప్లేట్ ఖాళీ చేసేస్తాం. నాలుక రుచిని అదుపు చేయకపోతే... అది నేరుగా మన హెల్త్‌కే ఎఫెక్ట్ ఇస్తుంది. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నారు పెద్దలు.

**క్వాంటిటీ కాదు, క్వాలిటీ!!** ఎంత తింటున్నామనేది కాదు, ఏం తింటున్నామనేది ముఖ్యం. పొట్ట నింపుకోవడం కోసం తినడం కాదు, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం తినాలి. ఎక్కువగా తినడం కంటే, పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం ఎంతో మేలు చేస్తుంది.నాలుక రుచికన్నా శరీర అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మితమైన ఆహారం మనసుకు ప్రశాంతతను, శరీరానికి శక్తిని అందిస్తుంది.క్వాంటిటీ తగ్గించి, క్వాలిటీ పెంచితే ఆరోగ్యమే అసలైన సంపదగా మారుతుంది. గ్యాడ్జెట్స్‌కు నో చెప్పండి తినేటప్పుడు ఫోన్‌ను పక్కన పెట్టేసి, ఆ ఆహారాన్ని ఎంజాయ్ చేస్తూ తిందాం. అదే నిజమైన 'మైండ్‌ఫుల్ ఈటింగ్'. టీవీ కూడా చూడకుండా తినేద్దాం.

**ప్రశాంతత వైపు అడుగులు** ఈ ఉరుకుల పరుగుల జీవితంలో సక్సెస్ వెనుక పరిగెత్తడం తప్పు లేదు. కానీ ఆ ప్రయాణంలో మన ప్రశాంతతను పణంగా పెట్టకూడదు.నోటిని అదుపులో పెట్టుకోవడం అంటే మన స్వేచ్ఛను కోల్పోవడం కాదు... మనల్ని మనం మరింతగా ప్రేమించుకోవడం. పెద్దల మాటలను ఓల్డ్ ఫ్యాషన్ అని కొట్టేయకుండా, వాటిని మన మోడర్న్ లైఫ్‌స్టైల్‌కు అడాప్ట్ చేసుకుందాం. తినడంలో అయినా, మాటల్లో అయినా... కంట్రోల్ చేద్దాం, ప్రశాంతంగా ఆనందంగా జీవిద్దాం.

**గడ్డం రాజు**
**వార్తాప్రభ ప్రతినిధి**

# నేషనల్ యోగా పోటీల్లో రామగుండం పోలీస్ మార్క్!!

● జాతీయ స్థాయిలో మెరిసిన పెద్దపల్లి కానిస్టేబుల్ ● ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో 'శ్రీలత'కు బ్రాంజ్ మెడల్ ● విధులతో పాటు క్రీడల్లోనూ రాణించడం తోటి సిబ్బందికి స్ఫూర్తిదాయకం ● సీపీ అంబర్ కిశోర్ ఝా



**పెద్దపల్లి/ గోదావరిఖని: జూన్ 6 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం పోలీస్ కమిషనరేట్ కీర్తిపతాకాన్ని జాతీయ స్థాయిలో ఎగురవేసిన మహిళా కానిస్టేబుల్ శ్రీలతకు శనివారం కమిషనరేట్ కార్యాలయంలో ఘనమైన సత్కారం లభించింది. హర్యానా రాష్ట్రం కర్నాల్ వేదికగా ఈ సంవత్సరం మే 23న అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన '3వ ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్'లో ఆమె అద్భుత ప్రతిభ కనబరిచారు. ముఖ్యంగా 35 నుంచి 45 సంవత్సరాల వయో విభాగంలో జరిగిన హోరాహోరీ యోగా పోటీల్లో శ్రీలత తన అసాధారణ నైపుణ్యంతో రాణించి, కాంస్య పతకాన్ని (బ్రాంజ్ మెడల్) కైవసం చేసుకున్నారు. పెద్దపల్లి జోన్‌కు చెందిన ఈ మహిళా కానిస్టేబుల్ సాధించిన ఈ చారిత్రాత్మక విజయం పట్ల రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో పోలీస్ రంగానికి చెందిన క్రీడా పోటీల్లో మెడల్ సాధించి, కమిషనరేట్ ప్రతిష్టను హిమగిరి శిఖరాలంత ఎత్తుకు తీసుకెళ్లిన శ్రీలతను సీపీ తన చాంబర్‌లో శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ, పోలీస్ విధుల్లో ఉండే మానసిక ఒత్తిడిని, పనిభారాన్ని అధిగమిస్తూ క్రమశిక్షణతో కూడిన యోగా సాధన ద్వారా ఈ పతకాన్ని కైవసం చేసుకోవడం మిగతా సిబ్బంది అందరికీ ఒక గొప్ప స్ఫూర్తి అని అన్నారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ఇంతటి ప్రతిభ కనబరిచిన శ్రీలతను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను అని తెలిపారు. భవిష్యత్తులో ఆమె జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని మెడల్స్ సాధించి, పోలీస్ శాఖకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, కమిషనరేట్ తరపున ఆమెకు పూర్తి మద్దతు ఉంటుంది అని అన్నారు. ఈ అపురూప సత్కార కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, కమాన్‌పూర్ ఎస్ఐ ప్రసాద్‌లతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొని శ్రీలతకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రకృతి మన జీవితంలో భాగం - దానిని కాపాడుకుందాం

**అరబిందో, అపిటోరియా ఫార్మా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ సూరత్**





**దుండిగల్, జూన్ 6, (వార్తాప్రభ) :** పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మన భవిష్యత్తు భద్రంగా ఉంటుందని, అకాల వర్షాలు, తీవ్రమైన వేడిగాలులు ప్రకృతి విధ్వంసానికి సంకేతాలని అరబిందో, అపిటోరియా ఫార్మా అరబిందో, అపిటోరియా ఫార్మా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ సూరత్ అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అపిటోరియా ఫార్మా వ యూనిట్ 2 లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ఆయన మొక్కలు నాటి నీరు పోశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగానే కాకుండా సమయం కుదిరినప్పుడల్లా ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మానవ మనుగడకు మొక్కలు ఎంతో అవసరమన్నారు. మొక్కలు మనకు ఆహారం, గాలి, నీరు మంచి వాతావరణాన్ని అందిస్తాయన్నారు. మొక్కలు మనకెంతో మేలు చేస్తాయన్నారు. మనం తినే ఆహారం, పీల్చే గాలి, మన ఆరోగ్యం, ఆనందం ,శ్రేయస్సు కోసం ప్రకృతిపై ఆధారపడి ఉంటామన్నారు. ప్రకృతి మన జీవనానికి ఎంతో అవసరం. మొక్కలు జంతువులు , ఇతర జీవులు పర్యావరణ వ్యవస్థలో ముఖ్యమైన భాగాలు. వాటిని రక్షించడం ద్వారా మనం పర్యావరణ వ్యవస్థ సమతుల్యతను కాపాడుకోవచ్చు అన్నారు. పర్యావరణం మనిషి మనుగడకు ఎంతో అవసరం. మనం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలంటే పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. కానీ మనం చేతులారా వాతావరణాన్ని కాలుష్యం చేస్తున్నామని నీరు, భూమి, గాలి అన్నీ కాలుష్యంగా మారి అనేక రోగాల బారిన పడుతున్నామన్నారు. ఈ కాలుష్య సమస్యల నుండి వాతావరణాన్ని కాపాడడం తన బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలి. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ హెచ్ ఎస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తపస్ సహా,ఈ హెచ్ ఎస్జనరల్ మేనేజర్ అమర్ కూడాలే, అపిటోరియా ఫార్మా యూనిట్ 2 జనరల్ మేనేజర్ వేల్పుల విజయ్ కుమార్,డిప్యూటీ జనరల్ మేనేజర్ అన్ను లక్ష్మీనారాయణ, మైంటెనెన్స్ డి జి ఎమ్ ఆకెళ్ళ రవికుమార్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మాదాలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు.



**కిర్లంపూడి జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కిర్లంపూడి మండలంలో ని బూరుగుపూడి గ్రామంలో ఆర్థిక అక్షరాశ్యతపై శనివారం గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బూరుగుపూడి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ . వై ఎన్ వి సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టారు.. గ్రామంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో సదస్సులో ముఖ్య అతిధిగా విచ్చేసిన కౌన్సిలర్ ఫిరోజ్ మరియు బ్యాంక్ మిత్ర కర్ణాకుల . శ్రీనివాసరావు గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ రంగంలోని వివిధ సేవలపై విస్తృత అవగాహన కల్పించారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రతిష్టాత్మక బీమా పథకాలైన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన , అటల్ పెన్షన్ యోజన మరియు ప్రధానమంత్రి జన్ ధన్ యోజన పథకాల విశిష్టతలను, వాటి ద్వారా చేకూరే ఆర్థిక భద్రతను ప్రజలకు కూలంకషంగా వివరించారు. ఈ పథకాల్లో ప్రతి ఒక్కరూ చేరి తమ భవిష్యత్తుకు ధీమా కల్పించుకోవాలని కోరారు.సైబర్ నేరాలపై అప్రమత్తత -- డిజిటల్ బ్యాంకింగ్ వినియోగం:నేటి ఆధునిక కాలంలో డిజిటల్ బ్యాంకింగ్ సేవలను సురక్షితంగా ఎలా ఉపయోగించుకోవాలో డెమో ద్వారా చూపించారు అలాగే ప్రస్తుతం పెరిగిపోతున్న సైబర్ మోసాల బారిన పడకుండా ఉండటానికి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, అపరిచిత వ్యక్తులకు ఓటిపి లు, పిన్ నంబర్లు చెప్పకూడదని సూచించారు.బయటి రుణాల వద్దు -- బ్యాంక్ రుణాలే ముద్దు:గ్రామీణ ప్రజలు అధిక వడ్డీలకు బయట వ్యక్తుల (వడ్డీ వ్యాపారుల) వద్ద అప్పులు తెచ్చుకుని ఆర్థికంగా నష్టపోవద్దని హెచ్చరించారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

# బలహీన వర్గాల పోరాట యోధుడు కామ్రేడ్ కాల్వ నరసన్న

**- డా. కొమ్ము అశోక్ యాదవ్**



**మంచిర్యాల, జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి) :** భీమారం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం వ్యవస్థాపకులు, గొర్రెల కాపరుల ఉద్యమ స్ఫూర్తి కామ్రేడ్ కాల్వ నరసయ్య యాదవ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ కామ్రేడ్ కాల్వ నరసయ్య యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ గొర్రెల, మేకల కాపరుల హక్కుల కోసం, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం కామ్రేడ్ కాల్వ నరసన్న చేసిన పోరాటం, త్యాగం ఆదర్శనీయం అన్నారు. ఆయన చూపిన బాటలో నడిచి గొర్రెల మేకల కాపరుల సంక్షేమం కోసం పోరాడుదాం అని కామ్రేడ్ కాల్వ నరసఅన్న ఆశయాల సాధన కోసం, కృషి చేయాలని గొర్రెల మేకల కాపరుల జీవనోపాధి పరిరక్షణ కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు.కామ్రేడ్ కాల్వ నరసయ్య యాదవ్ గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘాన్ని స్థాపించి, గొర్రెల కాపరులను సంఘటితపరిచి వారి హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడన్నారు. ఆయన స్ఫూర్తే నేడు లక్షలాది గొర్రెల కాపరులకు బలం. అయిందన్నారు. ఈరోజు అలాంటి వ్యక్తి మనలో లేకపోవడం చాలా బాధా కరమని తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం వ్యవస్థాపకులుకామ్రేడ్ కాల్వ నరసన్న యాదవ్ జయంతి ప్రభుత్వ అధికారికంగా చేయాలని డిమాండ్ చేస్తూ,నరసన్న ఫోటోకు సంఘం నాయకులతో కలసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మెండే మల్లేష్ యాదవ్, మండల గౌరవ అధ్యక్షులు వేల్పుల పర్వతాలు యాదవ్, ప్రధాన కార్యదర్శి కేశవేణి సత్యనారాయణ యాదవ్, ఉపాధ్యక్షులు దారవేని తిరుపతి యాదవ్, శ్రీనివాస్ యాదవ్, గాదె తిరుపతి యాదవ్, ఎల్ఐసి జనరల్ మేనేజర్ రేష వేణి శ్రీనివాస్ యాదవ్, కొక్కుల నరేష్ , సముద్రాల బాలమల్లు రాజన్న తదితర నాయకులు పాల్గొన్నారు.

# శిల్పారామం లో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





**శేరిలింగంపల్లి,జూన్ 6 (వార్తాప్రభ):** మాదాపూర్ శిల్పారామంలో శనివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు కళాభిమానులను అలరించాయి.ఈ సందర్భంగా శ్రీమతి లక్ష్మి సౌందర్య నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి విశేషంగా ఆకట్టుకుంది.అన్నమయ్య,త్యాగరాజ కీర్తనలు,భజనలు ఆలపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు.అనంతరం మీనాక్షి శిష్య బృందం ప్రదర్శించిన 'సద్గురు సమీరం'భరతనాట్య ప్రదర్శన ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. మహేశ్వరి మహాకాళి,అయ్యగిరి నందిని,శ్రీనివాస కల్యాణం, అఖిలాండేశ్వరి,ముద్దుగారే యశోద తదితర అంశాలను నృత్యరూపంలో ఆవిష్కరించారు.హారిక, జాహ్నవి,మనస్విని, ధరణి, జోషి, కళ్యాణి, లక్ష్మి, సంజన, హేమిత, కల్పన, రమాదేవి తదితర కళాకారులు తమ ప్రతిభతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

## దైవ దర్శనానికి పోయి వస్తూ ప్రమాదానికి

# గురైన ఒకే కుటుంబ సభ్యులు



జగ్గయ్యపేట జూన్ 6 (వార్తప్రభ)పట్టణం కి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు జమలాపురం దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా నిదానపురం- దెందుకూరు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ అదుపుతప్పి ఆటోను ఢీకొనడంతో ఐదుగురు ప్రమాదానికి గురయ్యారు. ఐదుగురిలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరు పరిస్థితి విషమయం. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఇద్దరిని మధిర నుండి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో చిన్న పాప, స్త్రీ తాళ్లూరి భవాని (40 ), పురుషుడు తాళ్లూరి చంద్ర (45 ) ఉన్నారు.

# సంపాదకీయం

## బీజేపీకి ఎప్పటికీ అర్థం కాని దక్షిణ భారతం !

భారతీయ జనతా పార్టీని ఉత్తరాది పార్టీ అని అంటారు. ఇపుడు కనిపిస్తున్న రాజకీయ సన్నివేశం చూస్తే కనుక అదే నిజం అనిపిస్తుంది. దక్షిణ భారత దేశంలో ఈ రోజున బీజేపీ ఎక్కడ ఉంది అన్నది కూడా పెద్ద ప్రశ్న. ఏపీలో బీజేపీ పొత్తుల బలంతోనే నెట్టుకుని వస్తోంది. తెలంగాణాలో 2024 లో కనిపించిన బలం కాస్తా ఉప ఎన్నికల్లో స్థానిక ఎన్నికల్లో తేలిపోయింది. కేరళలో పాతిక శాతం ఓటు షేర్ కనీసంగా ఎన్నో కొన్ని సీట్లు వస్తాయని అనుకుంటే ఆశించినది జరగలేదు. తమిళనాడులో 2021లో వచ్చిన నాలుగు సీట్లు కూడా ఈసారి మూడు తగ్గి ఒక్కటిగా నంబర్ చేరింది. కర్ణాటకలో చూస్తే విపక్షంలో ఉంది. ఇలా బీజేపీకి సౌత్ స్టేట్స్ అన్నీ ఫేస్ టర్నింగ్ ఇచ్చేసుకుంటున్నాయని అంటున్నారు. దక్షిణాది రాష్ట్రాలు ప్రత్యేకంగా చూడాల్సి ఉంది. మొదటి నుంచి ఇక్కడ రాజకీయ చైతన్యం ఎక్కువ. అంతే కాదు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ప్రత్యేకమైన భావజాలాన్ని కలిగి ఉన్నాయి. ఇవన్నీ వారి ఆశలు ఆకాంక్షలుగా కూడా చెప్పుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ తరహా ప్రాంతీయతను వారి సెంటిమెంట్స్ ని వారి మనోభావాలను అర్థం చేసుకోవడంలో బీజేపీ విఫలం అవుతోంది అని అంటున్నారు. పైగా బీజేపీ తన ఉత్తరాది భావాలనే దక్షిణాదినా అమలు చేయాలని చూడడం వల్ల రాజకీయంగా సక్సెస్ కాలేకపోతోంది అని అంటున్నారు.తమిళనాడులో తాజాగా బీజేపీకి రాజీనామా చేసిన అన్నామలై బీజేపీ మీద నిశితమైన విమర్శలు చేశారు. తమిళనాడులోని వాదాన్ని సెంటిమెంట్స్ ని బీజేపీ పట్టించుకోలేకపోయిందని ఆయన అన్నారు. తాను మాత్రం తమిళనాడు ఫస్ట్ అన్నట్లుగానే ముందుకు సాగుతాను అని చెప్పారు. బీజేపీని తమిళనాడు సెంటిమెంట్స్ ని జోడించి ముందుకు తీసుకుని పోవడంతో తాను శాయశక్తులా ప్రయత్నం చేశాను కానీ సాధించలేకపోయాను అని కూడా అన్నామలై అన్నారు. ఆయన మాటలను బట్టి చూస్తే బీజేపీకి స్థానిక అంశాల మీద సెంటిమెంట్ల మీద పట్టింపు లేదా లేక తమ భావజాలమే అక్కడ కూడా విస్తరించాలని ఆలోచించి అందులో ఫెయిల్ అవుతోందా అన్న చర్చ సాగుతోంది.అదే విధంగా చూస్తే తెలంగాణాలో అక్కడ తెలంగాణా అస్తిత్వం బలమైన నినాదంగా ఉంటుంది. బీజేపీ ఇక్కడ కూడా తన భావజాలం వ్యాప్తికే చూస్తోంది తప్పించి లోకల్ గా ఉన్న నినాదాలను విధానాలను గమనంలోకి తీసుకోవడంలేదని అంటున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ మాత్రం ప్రాంతీయ సెంటిమెంట్లను గౌరవిస్తూ వాటికి అనుగుణంగా తమ రాష్ట్రాల యూనిట్లతో కలిసి పనిచేస్తోంది అని అంటున్నారు. బీజేపీ ఒకే దేశం ఒకే పార్టీ ఒకే భావజాలం నినాదమే అన్ని విధాలుగా దక్షిణాదిన ఇబ్బంది పెడుతోంది అని అంటున్నారు. : ఇక ఏపీలో చూస్తే పొత్తులతో బీజేపీ గెలిచింది కానీ ఆ పార్టీ ప్రత్యేక హోదా విషయంలో జనాల సెంటిమెంట్ ని దెబ్బ కొట్టింది అన్న ఆవేదన అయితే ఆంధ్రులలో ఉంది. అలాగే ఢిల్లీ కంటే పెద్ద రాజధాని నిర్మిస్తామని నిధులిస్తామని చెప్పినా అమలు కాలేదు. విభజన హామీల సంగతి సరే సరిగా ఉంది. జాతీయ ప్రాజెక్టు పోలవరం పుష్కర కాలం అయినా పూర్తి కాలేదు. ఇక ఏపీ ప్రజల ఆకాంక్షలు అయితే నెరవేరడం లేదు అన్న అసంతృప్తి ఉందని చెబుతున్నారు. ప్రాంతీయ భాషలోనే : ప్రాంతీయ భాషను భావాన్ని అర్థం చేసుకుంటేనే తప్ప విజయాలు సమకూరవు. తమిళనాడులో తాజా ఫలితాలు బీజేపీకి అక్కడ చోటు లేదని తెలియచెప్పాయని అంటున్నారు. దానిని గ్రహించిన మీదటనే అన్నామలై పార్టీకి దూరం జరిగారు అని చెబుతున్నారు. మరో వైపు చూస్తే తెలంగాణాలో బీజేపీ ఏమంత గొప్పగా లేదు. ఇక కర్ణాటకలో జేడీఎస్ తో పొత్తులో బీజేపీ ఉంది. డీకే శివ కుమార్ సీఎం అయ్యారు. దాంతో అక్కడ కత్తి మీద సాముగానే రాజకీయం ఉండబోతోంది అని అంటున్నారు.

## చంద్రబాబువెన్నుపోటుకు రెండేళ్లు

**మైనారిటీలకు పాతాళానికి తొక్కిన కూటమి ప్రభుత్వం.**

**రాష్ట్ర వైఎస్ఆర్సిపి మైనార్టీ కార్యదర్శి బాజీ బాబా**

**హామీలు అమలపై గళమెత్తిన మైనారిటీలు**




**విజయవాడ పశ్చిమ జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గం లో స్థానిక54వ ,డివిజన్. వైయస్సార్.పార్టీఎన్టీఆర్.జిల్లాకార్యదర్శి షేక్ అహ్మద్ కార్యాలయంలో పత్రికా సమావేశం లో రాష్ట్ర వైఎస్ఆర్సిపి కార్యదర్శి మైనారిటీ బాజీ బాబా కూటమి ప్రభుత్వం పాలనపై విరుచుకుపడ్డారు. రాష్ట్రములో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీలకు ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కిన చంద్రబాబు గత ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఎన్నికల మ్యానిఫెస్టోలో మైనారిటీలకు విద్యార్థులకు స్కాలర్షిప్లు విద్యా దీవెన పేదముస్లిం ఆడపిల్లలకు షాదీముబారక్.పేదముస్లింలకు చేతివృత్తిదారులకు మైనారిటీ ఫైనాన్సు కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని బాజీ దుయ్యబట్టారు. మైనారిటీ విదేశీ విద్యస్కాలర్షిప్లు మహిళలకు 50 సంవత్సరాల పెన్షన్ పథకం అని మోసం చేశారనిరాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాలలో బడ్జెట్లో ప్రవేశపెడుతున్న సొమ్ములనుమైనారిటీలకు ఖర్చు పెట్టడం లేదని కూటమిప్రభుత్వ శ్వేత పత్రం విడుదల చేయాలని బాజీ బాబా తెలియజేశారు. వైసిపి ప్రభుత్వం లో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాలు, అభివృద్ధికార్యక్రమాలుకొనసాగిస్తామంటూ మోసపూరిత మాటలతో గద్దెనెక్కిన చంద్రబాబు ప్రభుత్వంరైతు భరోసా, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి ఇస్తానని మాటల చెప్పి ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వంసూపర్ సిక్స్ పథకాలు అమలు అంటూ ఎన్నికల హామీలులో చెప్పిన చంద్రబాబు గద్దెనెక్కాక మాట మరిచారన్నారు.కరోనా కష్టకాలంలో వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలకు రెండు లక్షల 70 వేల కోట్ల రూపాయలు నేరుగా లబ్దిదారుని బ్యాంకు ఖాతాలో వేసిన ఘనత జగన్మోహన్ రెడ్డిదని గుర్తు చేశారు. గత ఐదు సంవత్సరాలలో జగన్మోహన్ రెడ్డి మైనారిటీలకు 23,500 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని .బాజీ బాబాతెలియజేశారు విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జ్.రాష్ట్రమాజీమంత్రివర్యులువేల్లంపల్లి శ్రీనివాసరావు అభివృద్ధి పథంలో నియోజకవర్గాన్ని వందలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారని బాజీ బాబా కొని యాడారు. ఈ పత్రికా సమావేశంలో వైసిపిరాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ అధికార ప్రతినిధి రుద్రతేజ్ కుమార్ వైయస్సార్ రాష్ట్ర మున్సిపల్ వింగ్ సెక్రెటరీ పైడాడ శ్రీనివాసరావు ఎన్టీఆర్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ సల్మా సుల్తానా ఎన్టీఆర్ జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షుడు షేక్ ఇనుస్ ఎన్టీఆర్ జిల్లా మైనారిటీ సెక్రటరీ ఎస్కే నసిరుద్దీన్ తదితర మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో చైతన్యం అవసరం

**- గద్దె రామ్మోహన్, తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు**

**మూడు నుంచి నాలుగు డస్ట్‌బిన్ల విధానాని అందరూ అలవాటు చేసుకోవాలి- ధ్యానచంద్ర, వీఎంసి కమిషనర్**



**విజయవాడ పశ్చిమ జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో చైతన్యం అవసరమని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో భాగంగా మూడో వారానికి సంబంధించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఉదయం న్యూ ఆర్టీసీ కాలనీ, జేడీ నగర్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు నిర్వహిస్తున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం నగర పరిశుభ్రతకు కీలకమని పేర్కొన్నారు. జూన్ 6 నుండి 13 వరకు నిర్వహిస్తున్న "బల్క్ వేస్ట్ జనరేటర్స్ & సోర్స్ సెగ్రిగేషన్ ఎడ్యుకేషన్ వీక్" ద్వారా ప్రజలకు వ్యర్థాల వర్గీకరణ, నిర్వహణపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఇంటి వద్దనే చెత్తను వేరు చేయడం, శాస్త్రీయ వ్యర్థ నిర్వహణను అలవాటు చేసుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు సంపద సృష్టికి కూడా అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం చెత్తను నాలుగు రంగుల డస్ట్‌బిన్లలో వేర్వేరుగా సేకరించే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. వంటగదిలో ఉత్పత్తయ్యే తడి, సేంద్రియ మరియు సులభంగా కుళ్లిపోయే వ్యర్థాలను ఆకుపచ్చ రంగు డస్ట్‌బిన్‌లో వేయాలని సూచించారు. రీసైకిల్ చేయదగిన కాగితం, ప్లాస్టిక్, గాజు, లోహ పదార్థాల వంటి వ్యర్థాలను నీలం రంగు డస్ట్‌బిన్‌లో వేయాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు సంబంధించిన ఈ-వేస్ట్ వ్యర్థాలను నలుపు రంగు డస్ట్‌బిన్‌లో, శానిటరీ వ్యర్థాలు మరియు ఆరోగ్యానికి హానికరమైన ఇతర వ్యర్థాలను ఎరుపు రంగు డస్ట్‌బిన్‌లో వేయాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సరైన విధంగా చెత్తను వర్గీకరించడం ద్వారా వ్యర్థాల నిర్వహణ మరింత సమర్థవంతంగా జరిగి నగర పరిశుభ్రతకు తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ విధానాన్ని తప్పనిసరిగా పాటించేలా నగరవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.హోటళ్లు, అపార్ట్‌మెంట్లు, ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాలు వంటి అధిక పరిమాణంలో వ్యర్థాలు ఉత్పత్తి చేసే సంస్థలను "బల్క్ వేస్ట్ జనరేటర్లు"గా గుర్తిస్తున్నామని కమిషనర్ వివరించారు. ఇలాంటి సంస్థలు తమ వద్దే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దీనివల్ల నగర పరిశుభ్రత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన విజయవాడ నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని అధికారులు పిలుపునిచ్చారు. ఈ వారంలో నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొని వ్యర్థాల వర్గీకరణ, నిర్వహణపై మరింత అవగాహన పెంపొందించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డా. డి. చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ కే. షమ్మీ, చీఫ్ ఇంజనీర్ ఇన్‌చార్జ్ పి.సత్యకుమారి, చీఫ్ మెడికల్ & హెల్త్ ఆఫీసర్ డా. కే. అర్జునరావు, బయాలజిస్ట్ ఏ.జే. సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇన్‌చార్జ్ రామారావు, అసిస్టెంట్ మెడికల్ & హెల్త్ ఆఫీసర్ డా. గోపాల నాయక్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బత్తుల నాగ వెంకట రాఘవ్ అకాల మరణం పట్ల తీవ్ర సంతాపం

**బలివాడ శివకుమార్ పట్నాయక్**



**విజయవాడ పశ్చిమ జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తపేట ప్రాంతంలో ఎంతో మందికి సహాయ సహకారాలు అందిస్తూ, నిత్యం సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే ప్రముఖులు బత్తుల నాగ వెంకట రాఘవ్ (లలిత బార్) శనివారం అకస్మాత్తుగా మరణించడం అత్యంత బాధాకరమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఓ బి సీ మోర్చా ఉపాధ్యక్షులు బలివాడ శివకుమార్ పట్నాయక్ ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శివకుమార్ పట్నాయక్ మాట్లాడుతూ..."నాగ వెంకట రాఘవ్ కేవలం 35 సంవత్సరాల చిన్న వయసులోనే అకాల మరణం చెందడం సమాజానికి మరియు వారి కుటుంబానికి తీరని లోటు. ఆయన దైవచింతన కలిగిన గొప్ప వ్యక్తి. విజయవాడ కనకదుర్గమ్మ వారి గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎంతో భక్తిశ్రద్ధలతో చక్కటి ప్రసాద వితరణ చేయడం, దసరా నవరాత్రుల ఉత్సవాల సమయంలో 5,000 మందికి పైగా భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఆయన సేవా నిరతికి నిదర్శనం. అలాగే భానుడి భగభగలకు అల్లాడిపోయే ప్రజల కోసం ప్రతి వేసవిలో చల్లని మజ్జిగ పంపిణీ చేస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎల్లప్పుడూ చిరునవ్వుతో ఉంటూ, సమాజ హితం కోరే ఇటువంటి ఉత్తమ వ్యక్తి ఇంత త్వరగా మనల్ని విడిచి వెళ్లడం నన్ను తీవ్రంగా కలచివేసింది."?భగవంతుడి మీద అపారమైన ప్రేమతో, నిస్వార్థ భావంతో కొత్తపేట పరిసర ప్రాంత ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్న రాఘవ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు.అలాగే, ఈ తీరని శోకంలో మునిగిపోయిన వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు కొండంత మనోధైర్యాన్ని, ఈ బాధను తట్టుకునే శక్తిని ప్రసాదించాలని బలివాడ శివకుమార్ పట్నాయక్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## పశ్చిమ లోని అవుట్ ఫాల్ డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం..

**విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజన చౌదరి**



**విజయవాడ పశ్చిమ జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పశ్చిమ లోని జెండా చెట్టు, గాంధీ హిల్ అవుట్ ఫాల్ డ్రైనేజీ, నైజాం గెట్ అవుట్ ఫాల్ డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు.. నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారంవన్ టౌన్ జెండా చెట్టు, గాంధీ హిల్ అవుట్ ఫాల్ డ్రైనేజీ సమస్యలను ఎన్డీఏ కూటమి మాజీ కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే సుజనా చౌదరి పరిశీలించారు. పశ్చిమ లోని అవుట్ ఫాల్ డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం కోసం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి సమగ్రమైన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వర్షపు నీరు వెళ్ళటానికి స్టార్మ్ వాటర్ డ్రైన్స్ నిర్మించాలని భారీ వర్షాలకు మురుగునీరు పొంగిపొర్లకుండా రైల్వే ట్రాక్ క్రింద పూడిక తీయించాలని వర్షపు నీరు త్వరగా బయటకు పోయేటట్టు తగిన ఏర్పాట్లు చేయాలని మాజీ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు ఎమ్మెల్యే సుజనాకు తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి (దశాబ్దాల క్రితం) వేసిన నైజాం గేట్, గాంధీ హిల్ అవుట్ ఫాల్ డ్రైనేజీ వ్యవస్థను, పెరిగిన జనాభాకు అనుగుణంగా భూగర్భ డ్రైనేజీ పైపులను ఆధునికరించాలని కూటమి మాజీ కార్పొరేటర్లు ఎమ్మెల్యే సుజనా చౌదరిను కోరారు..పశ్చిమ లోని అవుట్ ఫాల్ డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి సమగ్రమైన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే సుజనా చౌదరి వారికి తెలిపారు..కూటమి మాజీ కార్పొరేటర్లు బుల్లా విజయ్ కుమార్, మరుపిళ్ల రాజేష్, అత్తలూరి ఆదిలక్ష్మీ పెదబాబు, టీడీపీ నాయకులు కొప్పుల గంగాధర్ రెడ్డి బీజేపీ నాయకులు రెడ్డి పల్లి రాజు, మంగళపురి మహేష్ పాల్గొన్నారు.

## యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చెయ్యాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా శరీరం, మనసు, ఆత్మను సమన్వయం చేసే సంపూర్ణ జీవన విధానమని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. యోగ సాధన ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత మరియు జీవన సంతులనం సాధ్యమవుతాయని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం మరియు విజయవాడ నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో "యోగాంధ్ర" కార్యక్రమాన్ని జూన్ 7 నుండి జూన్ 21 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించిందని, ఎన్టీఆర్ జిల్లాలో వేలాది మంది ఒకే వేదికపై యోగా సాధన చేసి ప్రపంచ రికార్డు సాధించడం గర్వకారణమని కమిషనర్ పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తోందన్నారు.ఈ నేపథ్యంలో జూన్ 7 నుండి జూన్ 21 వరకు ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు నగరంలోని భవానీపురం లోని బెర్మ్ పార్క్, సత్యనారాయణపురం లోని బి ఆర్ టి ఎస్ రోడ్, ఎంజీ రోడ్ లోని అంబేద్కర్ స్మృతి వనం, కృష్ణలంక లోని రివర్ ఫ్రంట్ పార్క్ ప్రాంతాల్లో యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నగర ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొని యోగా సాధనను దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాను ఒక రోజు కార్యక్రమంగా కాకుండా శాశ్వత ఆరోగ్య జీవనశైలిగా అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

## మెరుగైన వైద్యం కోసం రూ 11 లక్షల ఎల్ ఓ సీ అందజేత



**విజయవాడ పశ్చిమ జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన ఎల్ ఓ సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ను శనివారం ఎన్డీఏ కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ దాడి అప్పారావు,48 వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దేవిన హరిప్రసాద్ తో కలిసి అందజేశారు.44 వ డివిజన్, రామ రాజ్య నగర్ కు చెందిన సంభాని గంగమ్మ (54) హృద్రోగం తో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు శస్త్ర చికిత్స చేయాలని మరింత మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో బీజేపీనాయకుడు దేవిన హరిప్రసాద్ ఎన్డీఏ కార్యాలయంలో వైద్యం సాయం కోసం దరఖాస్తు చేయగా మంజూరైన రూ 11లక్షల 4 వేల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు..త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేయడంతో బాధితురాలి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుజనా కు కృతజ్ఞతలు తెలిపారు..

## కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని వినతి..

**ఎమ్మెల్యే సుజనా చౌదరి కు వినతి పత్రం అందజేసిన సామాజిక కార్యకర్త ఆకుల శ్రీనివాసకుమార్**



**విజయవాడ పశ్చిమ జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**35 వ డివిజన్,పెజ్జోనిపేట లో నిరుపయోగంగా ఉన్న సుమారు 5000 గజాల స్థలంలో ప్రజలకు ఉపయోగకరమైన కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని ప్రముఖ సామాజిక వేత్త ఆకుల శ్రీనివాసకుమార్ ఎమ్మెల్యే సుజనా చౌదరి కు వినతి పత్రం అందజేశారు..నియోజకవర్గ పర్యటనలో భాగంగా పెజ్జోనిపేటలో ఆకుల శ్రీనివాసకుమార్ శనివారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.2007 వ సంవత్సరం వరకు తమిళ పాఠశాల తమిళవాసుల నివాసాలు దేవాలయం ఉండేదని.. కాల క్రమేణ ఈ ప్రాంతం నిరుపయోగమై అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. పాఠశాల ఉన్న ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడితే ఈ ప్రాంతంలోని ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.. అదేవిధంగా బి.ఆర్.టి.ఎస్ రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ వైపుకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే కు ఆకుల శ్రీనివాస్ విజ్ఞప్తి చేయగా ఎమ్మెల్యే సుజనా చౌదరి సానుకూలంగా స్పందించారు...

## ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాల సందర్శన



**విజయవాడ పశ్చిమ జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) కమిషనర్ ధ్యానచంద్ర, ఆదేశాల మేరకు శనివారం నగర ప్రజలకు అజిత్ సింగ్ నగర్ గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ లో గల ఆర్ఆర్ఆర్ కేంద్రాలు, బయో రెమిడియేషన్ సైట్లు, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్) కేంద్రాలు, వ్యర్థాల నుండి కంపోస్ట్ తయారీ కేంద్రాలకు అవగాహన పర్యటనలు నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమం ద్వారా ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, వ్యర్థాల వర్గీకరణ, పునర్వినియోగం, పునర్వినియోగయోగ్య పదార్థాల రికవరీ, పర్యావరణ పరిరక్షణకు వీఎంసీ చేపడుతున్న చర్యలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. పర్యటనలో పాల్గొన్న ప్రజలు, అధికారులు మరియు ఇతర భాగస్వాములకు ఆయా కేంద్రాల పనితీరు, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్ విధానాలు, పాత చెత్త డంప్‌ల బయో రెమిడియేషన్ ప్రక్రియ, తడి వ్యర్థాల నుండి సేంద్రియ ఎరువు తయారీ విధానాలను ప్రత్యక్షంగా వివరించారు. నగర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు ఇంటి వద్దే చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి అందించడం ద్వారా స్థిరమైన వ్యర్థాల నిర్వహణకు సహకరించాలని పిలుపునిచ్చారు.

## నేటి నుంచి శ్రీ పాలేటి గంగమ్మ తల్లి జాతర మహోత్సవాలు



**సంగం జూన్ 06(వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండల కేంద్రంలోని శ్రీ పాలేటి గంగమ్మ తల్లి ఆలయంలో జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు జూన్ 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.జాతర మహోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.కలశ స్థాపన అమ్మవారికి అభిషేకాలు పుట్ట బంగారం సమర్పణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరగనున్నాయి.రెండో రోజు గ్రామోత్సవం మూడో రోజు పొంగళ్ళు కార్యక్రమం తో ఉత్సవాలు ముగుస్తాయి.అలాగే అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

## నాన్న నోట నీతి సూక్తులు



దైవానికి ఇష్టము
విలువైన యథార్థత
పిల్లలను దిద్దడం
మన అందరి బాధ్యత
ప్రేమలేని బ్రతుకులు
నీరెండిన చెరువులు
కరుణ లేని పుత్రులు
త్రాణ లేని ప్రాణులు
గుణం లేని మనుషులు
కాపు లేని తరువులు
కఠినమైన మనసులు
బండ రాతి సమములు
జీవితాన విలువలు
గుబాళించు సుమములు
తెచ్చిపెట్టు గౌరవము
ప్రతి మనిషికి అవసరము

**గద్వాల సోమన్న,**
**ఎమ్మిగనూరు,**
**సెల్ :9966414580**

# ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలి.

**కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.**




**మచిలీపట్నం జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి):**ఆరోగ్యకర సమాజం నిర్మించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చారు.ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆరోగ్యంగా ఉంటే అంతకు మించిన సంపదలేదని మన చేతుల్లో మన ఆరోగ్యం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాణం ఉన్నంతవరకు ప్రాణాయామాలు చేద్దామని, అవయవాలు ఉన్నంతవరకు ఆసనాలు వేద్దామని కలెక్టర్ పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 7 వ తేదీ నుండి 21వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పలు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.ఈనెల 7 వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు మంగినపూడి బీచ్ లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణకు అని ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.అలాగే ఈ నెల 10వ తేదీన ఉదయం 7 గంటలకు గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో లారీ, ఆటోసంఘాల ప్రతినిధులతో కలుపుకొని యోగ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 16వ తేదీన ఉదయం 7 గంటలకు ప్రముఖ నాట్య క్షేత్రమైన మొవ్వ మండలం కూచిపూడి లోని శ్రీ సిద్ధేంద్ర కళాక్షేత్రంలో కూడా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 21వ తేదీన ఉదయం 7 గంటలకు అంతర్జాతీయ యోగా దినోత్సవం జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ఉయ్యూరులోని శ్రీ విశ్వశాంతి పాఠశాలలో నిర్వహిస్తామన్నారు.జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ఒక్కో మాస్టర్ ట్రైనర్ ద్వారా యోగ పై ఆసక్తి ఉన్న 50 మంది ప్రజలకు యోగా శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు విరివిగా పాల్గొని యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# ఎన్నికల ప్రభంజనానికి ఎదురు నిలబడే నాయకుడు ఎవరు?

**26 ఏళ్ల బందరు రాజకీయ ప్రస్థానం**
**మచిలీపట్నం రాజకీయాలపై బందరు ప్రజల మదిలో ప్రశ్నలు.**



**మచిలీపట్నం జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణాజిల్లా రాజకీయాలలో మచిలీపట్నం నియోజకవర్గానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. రాష్ట్ర రాజకీయ పరిణామాలను ప్రతిబింబించే నియోజకవర్గంగా బందరు పేరుగాంచింది. అయితే గత మూడు దశాబ్దాలుగా ఇక్కడ వారసత్వ రాజకీయాలే ప్రధానంగా కొనసాగుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. ప్రజలు మెచ్చి ఎన్నుకున్న నాయకత్వమా? లేక ప్రత్యామ్నాయం లేక కొనసాగుతున్న రాజకీయ సంస్కృతా? అనే చర్చ ప్రస్తుతం నియోజకవర్గంలో ఆసక్తికరంగా మారింది. 2000 సంవత్సరం నుంచి 2026 వరకు దాదాపు 26 ఏళ్ల రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే, మచిలీపట్నం నియోజకవర్గంలో స్థానిక నాయకత్వం కంటే రాష్ట్ర రాజకీయాల ప్రభావమే ఎక్కువగా కనిపిస్తుంది. అధికారంలోకి వచ్చిన పార్టీ అభ్యర్థే ఎక్కువసార్లు విజయం సాధించగా, స్థానిక అభివృద్ధి ఆధారంగా ఎన్నికలను ప్రభావితం చేసిన ఉదాహరణలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి.

**వైఎస్సార్ ప్రభావం – 2004లో కాంగ్రెస్ విజయం.** 2004 ఎన్నికల నాటికి తెలుగుదేశం పార్టీపై రాష్ట్రవ్యాప్తంగా వ్యతిరేకత నెలకొంది. రైతుల ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభం వంటి అంశాలు ప్రజల్లో అసంతృప్తిని పెంచాయి. ఈ సమయంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర కాంగ్రెస్‌కు కొత్త ఊపునిచ్చింది. ఆ ప్రభావంతో మచిలీపట్నం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పేర్ని నాని విజయం సాధించారు. 2009లో మళ్లీ కాంగ్రెస్‌కు మద్దతు ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104 వంటి సంక్షేమ పథకాల కారణంగా 2009లో ప్రజలు మరోసారి వైఎస్సార్‌కు మద్దతు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ తిరిగి రెండవసారి అధికారంలోకి రావడంతో మచిలీపట్నంలో కూడా పేర్ని వెంకట్రామయ్య రెండవసారి విజయం సాధించారు. స్థానిక అంశాల కంటే రాష్ట్ర నాయకత్వం, సంక్షేమ పథకాలే ఆ విజయానికి ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2009లో మెగాస్టార్ చిరంజీవి మొదటిసారిగా రాజకీయ ప్రవేశం చేసినాప్పటికీ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టి ప్రజారాజ్యం కి 19 సీట్లకు పరిమితం చేశారు.. చిరంజీవి రాజకీయ ప్రవేశం చేసిన ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కి ఉన్న ఆదరణ ప్రజల్లో ఆ ఎన్నికలలో స్పష్టంగా కనిపించింది.

**పలు మార్లు శంకుస్థాపనలు...** కృష్ణాజిల్లా చిరకాల వాంఛా ఐన బందరు పోర్టు నిర్మాణం మాత్రం కలగానే మిగిలింది. 2004 నుంచి 2014 మధ్య మచిలీపట్నం పోర్టు నిర్మాణం కోసం పలుమార్లు శంకుస్థాపనలు జరిగినప్పటికీ ఈ ప్రాజెక్టు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. దీంతో పోర్టు నిర్మాణం , పరిశ్రమలు స్థాపన, ఉపాధి అవకాశాల విషయంలో ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. విద్య, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాల కోసం విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ వంటి నగరాలపై జిల్లా ప్రజలు ఆధారపడాల్సిన పరిస్థితి కొనసాగింది.

**రాష్ట్ర విభజన తర్వాత మారిన రాజకీయ సమీకరణాలు.** 2014లో రాష్ట్ర విభజన అనంతరం అభివృద్ధి, రాజధాని నిర్మాణం వంటి అంశాలను ముందుకు తెచ్చిన తెలుగుదేశం పార్టీకి ప్రజలు మద్దతు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో మచిలీపట్నంలో కూడా టిడిపి అభ్యర్థి కొల్లు రవీంద్ర విజయం సాధించారు. అయినప్పటికీ నియోజకవర్గ అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదనే విమర్శలు కొనసాగాయి. కాగా 2014 నుండి 2019 వరకు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో కొల్లు రవీంద్ర మంత్రిగా పనిచేశారు. అయినా మచిలీపట్నం నియోజవర్గంలో ఏ విధంగా అభివృద్ధి జరగలేదు. 2018 లోనూ పోర్ట్ కు తెలుగుదేశం ప్రభుత్వం మరల శంకుస్థాపన చేశారు.

**2019లో జగన్ ప్రభంజనం.** 2019 ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా భారీ మద్దతు లభించింది. ఆ ప్రభంజనంలో మచిలీపట్నం నుంచి పేర్ని నాని వైయస్సార్సీపీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మూడవసారి నియోజవర్గం నుండి ఎన్నికయ్యారు. దీంతో మరోసారి రాష్ట్ర పార్టీ ల రాజకీయా ప్రభావం వలనే పేర్ని నాని విజయం సాధించారనే అభిప్రాయం బలపడింది.

**రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ ప్రభంజనాలను తట్టుకుని గెలిచిన నాయకుల ఉదాహరణలు** 2019లో 151 సీట్లు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభంజనంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నిమ్మల రామానాయుడు పాలకొల్లులో విజయం సాధించారు. అలాగే 2024లో 164 సీట్లతో కూటమి ప్రభంజనాన్ని తట్టుకుని రాష్ట్రంలో 11 మంది వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. 2019 ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని తట్టుకొని తెలుగుదేశం పార్టీకి చెందిన బలమైన క్యాడర్ ఉన్న నాయకులు మాత్రమే గెలుపొందారు. ఈ గెలుపొందిన వారిలో కొల్లు రవీంద్ర లేకపోవడం శోచనీయం. 2024 జరిగిన ఎన్నికలలో కూటమి ప్రభంజనంలో పేర్ని నాని తనయుడు పేర్ని కిట్టు ఓటమి చెందారు. మచిలీపట్నం నియోజవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులు వ్యక్తిగతమైనటువంటి క్యాడర్ లేకపోవడమే ఓటమికి కారణం అని ప్రజలు అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పలు పార్టీలకు చెందిన నాయకులు ప్రజల ఆశీస్సులు మెండుగా ఉండిన వారే మాత్రమే ఎమ్మెల్యేలుగా గెలవగలుగుతున్నారు. మచిలీపట్నంలో పేర్ని నాని ,పేర్ని కిట్టు, కొల్లు రవీంద్ర కు ప్రజల నుండి పూర్తిస్థాయిలో మద్దతు లేకపోవటంతో పార్టీల మీదే ఆధారపడి గెలవగలుగుతున్నారని అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. ఎన్నికల ప్రభంజనాన్ని తట్టుకుని నిలబడే నాయకుడు లేకపోవడం స్థానిక నాయకత్వ బలహీనతగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మచిలీపట్నంలో గెలుస్తోంది పార్టీనా? నాయకుడా? గత రెండు దశాబ్దాల ఎన్నికలను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన పార్టీ అభ్యర్థికే మచిలీపట్నం ప్రజలు ఎక్కువసార్లు పట్టం కట్టారు. అయితే అభివృద్ధి, ప్రజా సేవల ఆధారంగా రాష్ట్ర రాజకీయాలకు వ్యతిరేకంగా నిలబడి గెలిచిన నాయకత్వం బందరు నియోజవర్గంలో కనిపించలేదు. దీంతో మచిలీపట్నం ప్రజలు నిజంగా నాయకులను ఎన్నుకుంటున్నారా? లేక రాష్ట్ర రాజకీయ తరంగాలనే అనుసరిస్తున్నారా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. మచిలీపట్నం నియోజవర్గంలో వారసత్వ రాజకీయ పట్ల ప్రజలలో వక్కింత నిరసన వ్యక్తం అవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నియోజకవర్గంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న ప్రజలు ఆశించిన విధంగా అభివృద్ధి జరగడం లేదు.

**భవిష్యత్ రాజకీయాలకు మలుపు?** ప్రస్తుతం యువతలో మారుతున్న రాజకీయ అవగాహన, ఉపాధి అవకాశాలపై పెరుగుతున్న చర్చలు, అభివృద్ధిపై పెరుగుతున్న అంచనాలు మచిలీపట్నం రాజకీయాలను కొత్త దిశగా తీసుకెళ్లే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో కూడా వారసత్వ రాజకీయాలకే ప్రజలు పట్టం కడతారా? లేక అభివృద్ధి, పనితీరు, ప్రజా విశ్వాసాన్ని ఆధారంగా చేసుకున్న కొత్త రాజకీయ నాయకత్వాన్ని ముందుకు తెస్తారా? అన్న ప్రశ్నకు సమాధానం భవిష్యత్ ఎన్నికలే చెప్పనున్నాయి.మచిలీపట్నం రాజకీయాల తదుపరి అధ్యాయం ఎలా ఉండబోతోందన్న ఆసక్తి ఇప్పుడు బందరు ప్రజల్లో నెలకొంది.

# జాతీయ రహదారిపై కారు దగ్ధం



**ఆత్మకూరు జూన్ 06 (వార్తాప్రభ)** నెల్లూరు--ముంబై జాతీయ రహదారిపై కదిరినాయుడుపల్లి అడవి ప్రాంతంలో ఓ కారు అగ్నికి ఆహుతైంది.ప్రొద్దుటూరు నుంచి పెంచలకోన వెళ్తున్న సమయంలో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి వెంటనే వాహనాన్ని నిలిపివేసి అందరినీ సురక్షితంగా బయటకు తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది.ప్రయాణికులు కారుకు దూరంగా వెళ్లిన కొద్ది సేపటికే మంటలు మరింత వ్యాపించి కారు పూర్తిగా దగ్ధమైంది.సమాచారం అందుకున్న మర్రిపాడు అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.అయితే అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది.ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కూడా అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అధిక ఉష్ణోగ్రతలు వాహనాల సాంకేతిక లోపాల కారణంగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందని, జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులు వాహనాల పరిస్థితిని ముందుగానే తనిఖీ చేసుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని మర్రిపాడు ఎస్సై బలరాం రెడ్డి సూచించారు.

# నేటి నుండి ప్రారంభమైన ఇంటర్ తరగతులు




**ఆత్మకూరు జూన్ 06 (వార్తాప్రభ)** వేసవి సెలవులు అనంతరం ఆత్మకూరులో నేటి నుంచి ఇంటర్మీడియట్ విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు పట్టణంలోని ప్రైవేట్ కళాశాలల్లో కూడా విద్యార్థులకు తరగతులు ప్రారంభించారు.అదే సమయంలో నూతన అడ్మిషన్ల ప్రక్రియను కళాశాలల లెక్చరర్లు చేపట్టారు. మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రవేశాల కోసం తల్లిదండ్రులు కళాశాలలను ఆశ్రయించగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. దీంతో కళాశాల ప్రాంగణాలు విద్యార్థుల సందడితో కళకళలాడాయి.కొత్త విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు అధ్యాపకులు తెలిపారు.

## నగర ప్రజలు సహకరిస్తే సుందర బందరు...మునిసిపల్ కమీషనర్ బాపిరాజు.



**మచిలీపట్నం జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగర ప్రజలు పారిశుధ్య కార్యక్రమాలకు సహకరిస్తే సుందర బందరును రూపొందించగలమని మున్సిపల్ కమిషనర్ బాపిరాజు అన్నారు శనివారం రామానాయుడు పేటలో మాజీ కౌన్సిలర్ లోగిసెట్టి వెంకటస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఆపరేషన్ క్లీన్స్ కార్యక్రమంలో కమిషనర్ బాపిరాజుపాల్గొన్నారు వీధుల్లో స్వయంగా కమిషనర్ బాపిరాజు, మాజీ కౌన్సిలర్ వెంకటస్వామి వీధులు ఊడ్చారు. డ్రైన్లలో సిల్ట్ తీశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘ ఉపాధ్యక్షుడు కేకే చింతయ్య మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కో కన్వీనర్ ముదిగొండ శాస్త్రి వార్డు పెద్దలు శర్మ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో 50 డివిజన్లో స్వచ్ఛ సైనికులు పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించేందుకు పారిశుధ్యం పై అందరూ దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

## శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయం అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు....




**పెనుగంచిప్రోలు, జూన్ 6( వార్త ప్రభ )** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేర రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాలల్లో అంతర్ జాతీయ యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించాలని రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ గోపయ్య స్వామి సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయం లో 7 వ తేది అనగా ఆదివారం నుండి 21 వ తేది వరకూ దేవస్థానం లోని మేడ మండపం లో అంతర్ జాతీయ యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ కమిషనర్,ఆలయ కార్యనిర్వహనాధికారి. బి. మహేశ్వర రెడ్డి తిలిపారు., అలాగే 21 వ తేది ముగింపు రోజు ఆలయ సిబ్బంది, పాఠశాల ల విద్యార్డులు,స్వచ్ఛందా స్థశీ స్థలు, భక్తుల తో కలిపి కనీసం 100 మంది తో ఏక కాలంలో యోగ సనాలు చేసేలా ప్రణాళిక రూపొందిచనున్నట్లు చర్యలు తీసుకుంటున్నట్లు ఈ. ఓ. మహేశ్వర రెడ్డి తెలిపారు.

## నూతన తహసీల్దార్‌ను సత్కరించిన టీడీపీ శ్రేణులు



**కోడూరు జూన్ 6 (వార్తా ప్రభ) :**కోడూరు మండల నూతన తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన కే. పూర్ణచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.శనివారం మండల రెవిన్యూ కార్యాలయంలో నూతన తహసీల్దార్‌ను టీడీపీ మండల శ్రేణులు దుశ్శాలువాతో సత్కరించి,కొత్త బాధ్యతల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.కోడూరు మండలంలో రైతులు, సామాన్య ప్రజలు రెవిన్యూ సేవల కోసం ఆఫీసు చుట్టూ తిరుగుతున్నారని, ప్రజలకు ఇబ్బంది లేకుండా సత్వర సేవలు అందించాలని తహశీల్దార్ ను టీడీపీ నాయకులు కోరారు.


## సర్ కు సిద్ధం- రాజకీయ పార్టీలతో తహసీల్దార్ సమావేశం



**కోడూరు, జూన్ 6 (వార్తా ప్రభ) :**రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ సిద్ధం పై అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం కోడూరు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ కే పూర్ణచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్థానిక పార్టీల నేతలు, బి ఎల్ ఓ లు, బూత్ ఏజెంట్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిజమైన ఓటరుకు అన్యాయం జరగకుండా, అనర్హుల ఓట్లకు చెక్ పెట్టే ఉద్దేశంతో సర్ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఓట్లు, నకిలీ ఓట్లు, మృతుల ఓట్లు, ఒకరి పేరుతో రెండు చోట్ల ఉన్న ఓట్లు , వీటన్నింటినీ తొలగించడమే లక్ష్యంతో అర్హులైన ప్రతి పౌరుడి పేరు జాబితాలో ఉండేలా చూస్తామని స్పష్టం చేశారు.ఇంటింటి సర్వే సమయంలో ఓటర్లు ఆధార్, పుట్టిన తేదీ, నివాస ధృవీకరణ పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని , బి ఎల్ ఓ వచ్చినప్పుడు సహకరించాలని తహసీల్దార్ కోరారు.సమావేశంలో పలు పార్టీల నేతలు మాట్లాడుతూ, చాలా మంది బూత్ ఏజెంట్లకు ఈ సమావేశం గురించి సమాచారం అందలేదని తెలిపారు. దీంతో ఏజెంట్లు హాజరు కాలేకపోయారని తెలపడంతో... తహసీల్దార్ పార్టీల అభ్యర్థన మేరకు ఈ నెల 12వ తేదీన మరోసారి సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏఐ ఆధారిత ఈసీడీ స్క్రీనింగ్ శిక్షణ

**సంగం జూన్ 06(వార్త ప్రభ ప్రతినిధి)** మండలంలోని గాంధీజనసంఘం హైస్కూల్‌లో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధి, ఆరోగ్య పరిస్థితులను సమర్థవంతంగా అంచనా వేయడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఈసీడీ స్క్రీనింగ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ప్రాజెక్టు సీడీపీవో పి సునీలత తెలిపారు.నవచేతన కార్యక్రమంలో భాగంగా 0 నుంచి 6 సంవత్సరాల పిల్లల్లో ఎదుగుదల లోపాలు పోషకాహార సమస్యలు మానసిక రుగ్మతలు ఇతర ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి వారికి తగిన సేవలు అందించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. స్క్రీనింగ్ ద్వారా వైకల్యాలను ముందుగానే గుర్తించి చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని పేర్కొన్నారు. పిల్లల్లో పుట్టుకతో వచ్చే వైకల్యాలను అంగన్‌వాడీ కార్యకర్తలు ఎలా గుర్తించాలి స్క్రీనింగ్ అనంతరం గుర్తించిన సమస్యలను వైద్యులకు రిఫర్ చేస్తూ అవసరమైతే డీఈఐసీ కేంద్రానికి పంపించే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే పిల్లల జీవితంలో తొలి వెయ్యి రోజుల సంరక్షణ ప్రాధాన్యతను సీడీపీవో సునీలత వివరించారు. పిల్లలలో అభివృద్ధి



చెందాల్సిన స్థూల చలనం సూక్ష్మ చలనం భాషా మేధో సామాజిక–భావోద్వేగ అభివృద్ధి అంశాలపై సూపర్వైజర్ ఆర్. రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ రోజీ రేచల్ అవగాహన కల్పించారు. మొబైల్ ద్వారా స్క్రీనింగ్ ప్రక్రియ నిర్వహణపై కూడా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా జగ్గయ్యపేట కోర్టు ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం



**జగ్గయ్యపేట, జూన్ 6 (వార్తప్రభ)** ప్రపంచ ఆహార భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని జగ్గయ్యపేట కోర్టు ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. సమాజంలో ప్రతి వ్యక్తి సురక్షితమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని, అలాగే ఆహారాన్ని వృథా చేయకుండా సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన అతిథిగా పాల్గొన్న జగ్గయ్యపేట న్యాయమూర్తి ఎ. హిమబిందు మాట్లాడుతూ, ఆహార భద్రత అనేది ప్రజారోగ్యానికి మూలస్తంభమని తెలిపారు. ఆహారం తయారీ, నిల్వ, వినియోగం వంటి ప్రతి దశలో పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని సూచించారు. అలాగే ఆహారాన్ని వృథా చేయకుండా అవసరమైన మేరకు మాత్రమే వినియోగించడం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నేపాక సుందరరావు మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఆకలితో బాధపడుతున్న పరిస్థితుల్లో ఆహార వృథాను నివారించడం ప్రతి పౌరుని కర్తవ్యమని పేర్కొన్నారు. జాయింట్ సెక్రటరీ దాసరి వెంకట కృష్ణ ఆహార భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు జి. వెంకటేశ్వర్లు, దాసరి నాగేశ్వరరావు, మెట్టెల వీరాంజనేయులు, అంకమ్మరాజు, గురువురాజు పాల్గొని ఆహార భద్రత ప్రాముఖ్యతపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అదేవిధంగా కోర్టు సిబ్బంది, శ్రీ శివానంద ట్రస్ట్ నాయుడు, అన్నపూర్ణ సేవా సమితి వ్యవస్థాపకులు మహంకాళి ప్రకాష్ మరియు వారి సమితి సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో విశేషంగా సహకరించారు. ఈ కార్యక్రమం ముగింపులో ఆహార భద్రత, పరిశుభ్రత, పోషకాహారం మరియు ఆహార వృథా నివారణపై ప్రజల్లో మరింత చైతన్యం కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని నిర్ణయించారు. పాల్గొన్న వారందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రజాసేవలో పేదలకు... సహాయం చేయండి.

## మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్. ఘనంగా జోగారావు జన్మదిన వేడుకలు.



**జవహర్ నగర్, జూన్ 6: (వార్తా ప్రభ)**ప్రజాసేవలో పేదలకు సహాయం చేయండి అని తద్వారా సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. జవహర్ నగర్ తూర్పు శాఖ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షుడు కర్లపూడి జోగారావు తన జన్మదినాన్ని పురస్కరించుకుని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్.. జోగారావుకు శాలువా కప్పి, బొకే అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కర్లపూడి జోగారావు మాట్లాడుతూ.. తన జన్మదినం నాడు ఎంపీ ఈటల రాజేందర్ ను కలిసి ఆశీర్వాదాలు పొందడం అదృష్టంగా భావిస్తున్నానని ఆనందం వ్యక్తం చేశారు. ఈటలచూపిన ఆప్యాయత, అందించిన ఆశీస్సులు నాకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయి. ప్రజాసేవ పట్ల నా బాధ్యతను మరింత పెంచాయి" అని పేర్కొన్నారు. పెద్దల ఆశీస్సులు జీవితానికి దిక్సూచి లాంటివని, వారి ప్రోత్సాహం విజయపథంలో ముందుకు నడిపించే మార్గదర్శకంగా నిలుస్తుందని కొనియాడారు. పార్టీ పెద్దల ఆశీస్సులతో సమాజ సేవలో మరింత నిబద్ధతతో, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఈ సందర్భంగా జోగారావు స్పష్టం చేశారు. అలాగే, తన పుట్టినరోజు సందర్భంగా తనకు ప్రేమాభిమానాలతో శుభాకాంక్షలు, ఆశీస్సులు అందించిన ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మర్యాదపూర్వక సమావేశంలో జోగారావుకు శుభాకాంక్షలు తెలిపేందుకు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న వారిలో: సంతోష్ గుప్తా బీజేపీ రాష్ట్ర నాయకులు) మహేందర్ యాదవ్ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు పుణ్యరాజు జిల్లా నాయకులు బొమ్మ యాదగిరి ప్రధాన కార్యదర్శి తదితరులు ఉన్నారు.


# వడగాలిలోనూ వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తజనం...





**గుడ్లవల్లేరు:జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రచండ భానుడు నిప్పులు కురిపించే వడగాలుల్లో సైతం మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు శనివారం భక్తజనం బారులు తీరటంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన వేలాది మంది భక్తులకు భారీ అన్న సమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ తెలిపారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారన్నారు. తొలుత స్వామివారికి విశేషాభిషాకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు బారులు తీరారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

# ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన తహసీల్దార్ ఎస్. శిరీష



**జగ్గయ్యపేట జూన్ 6 (వార్తప్రభ)** తహసీల్దారుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్. శిరీష శనివారం జగ్గయ్యపేట పట్టణంలోని ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, జగ్గయ్యపేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవల అందజేత, రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. తహసీల్దార్ ఎస్. శిరీష కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

# జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై వివిధ రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం.

● జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ఏర్పాటు ● చైర్మన్ గా ఇఫ్టూ షేక్ షావలి, కన్వీనర్ గా సిపిఐ ఉమామహేష్ ● డంపింగ్ యార్డు సమస్యపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయం. ● గౌరవ సలహాదారులు మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, ఉపసర్పంచ్ రావల్ కోల్ నర్సింహ్మా గౌడ్, కల్లెపల్లి సదానందం.

**జవహర్ నగర్, జూన్ 6:(వార్తా ప్రభ)** ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డును ఎత్తివేయాలని ముక్త కంఠంతో వివిధ రాజకీయ, పార్టీలు, మీడియా మిత్రులు, ప్రజాసంఘాలకు చెందిన నేతలు డిమాండ్ చేశారు. 2026, జూన్-06, శనివారం రోజు జవహర్ నగర్, కీసర సర్కిల్ పరిధిలో గల బాలాజీనగర్, దళిత సంక్షేమ భవన్ లో ఇఫ్టూ షేక్ షావలి, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై.మల్లేష్, ఐ.ఎఫ్.టి.యు. శివబాబు, టియుసిఐ వి.ప్రవీణ్ అధ్యక్షతన డంపింగ్ యార్డు సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఐ మాజీ ఎంపీటీసీ తోటపల్లి శంకర్, సిపిఎం శివన్నారాయణ, బీఎస్పీ బిర్రుయాకస్వామి, మాజీ మేయర్ మేకల కావ్య, బీఆర్ఎస్ కొండల్ ముదిరాజ్, ఆలూరి రాజశేఖర్, తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటి తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, తెలంగాణ రక్షణ సేన(టిఆర్ఎస్)లలిత యాదవ్, తెలంగాణ జనసమితి భద్రగామి అంజనేయులు, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ అనురాధ, జయసుద, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ గడ్డం సదానందం, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై.మల్లేష్, ముస్లిం కమిటీ పాషామీయా, బహుజన సత్త సింగరాయ గౌడ్, సిఎంఎస్ జయ, అల్లూరి సావిత్రి, పికెఎం జాన్, పిడిఎం చంద్రమౌళి, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునిత, పిఓడబ్ల్యూ స్వరూప, లక్ష్మీ, బూడిద వెంకటేష్, ప్రతాప్, యాదగిరి, రాణి, శంకర్, లక్ష్మీనర్సింహ్మా కాలనీ లక్ష్మణ్, దున్నపోతుల నర్సింహ్మా, తుమ్మరాణి, నర్సింగరావు శాంతినగర్ సుబ్రమణ్యం తదితరులు పై కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భవిష్యత్ కార్యచరణలో బాగంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ఏర్పాటు చేశారు. గౌరవ సలహా దారులుగా మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, ఉపసర్పంచ్ ఆర్. నర్సింహ్మా గౌడ్ మరియు కల్లెపల్లి సదానందం,



కమిటీ చైర్మన్ గా ఇఫ్టూ షేక్ షావలి, కన్వీనర్ గా సిపిఐ ఉమామహేష్, కోశాధికారి శివబాబు, కో కన్వీనర్లుగా మేకల కావ్య, కొండల్ ముదిరాజ్, ఆలూరి రాజశేఖర్, శివన్నారాయణ, లలిత యాదవ్, ఆంజనేయులు, అనురాధ, గడ్డం సదానందం, వై.మల్లేష్, ప్రఫుల్ రాంరెడ్డి, పాషామీయా, సింగరాయ గౌడ్, యాకస్వామి తీసుకోవడం జరిగిందని నిర్వాహణ కమిటి ప్రకటించింది. ప్రజాసంఘాలు, కుల సంఘాలు, బస్తీ సంఘాలు మరియు సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు కమిటీ సభ్యులుగా కొనసాగుతారని గుర్తుచేశారు. గాలి, నీరు, భూమి కలుషితం చేసిన డంపింగ్ యార్డును ఎత్తివేయాలని, జవహర్ నగర్ ప్రాంతంలో చాలా బస్తీలలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు సరఫరా, 100 పడకల ఆసుపత్రి లాంటి తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. లేని యెడల డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగబోయే ప్రజా ఆందోళనలకు ప్రభుత్వమే నైతిక భాద్యత వహించాల్సి ఉంటుందని ప్రభుత్వ అదికారులకు, పాలకులకు ఈ సందర్భంగా పలువురు సూచించారు.

# రికార్డు స్థాయిలో తగ్గిన బొగ్గు నిల్వలు!!

● పదేళ్లలో అత్యల్పంగా 26.51 లక్షల టన్నుల నిల్వలు ● పనులు మధ్యలో ఆగిపోకుండా ముందస్తు అంచనా కోసం సైట్ విజిట్ ● మెడికల్ బోర్డు అక్రమాలపై ఏసీబి, విజిలెన్స్ విచారణ ● సింగరేణి యాజమాన్యం వెల్లడి




**పెద్దపల్లి/గోదావరిఖని:జూన్ 6 (వార్తాప్రభ ప్రతినిధి)** దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి సంస్థలో బొగ్గు నిల్వలు గణనీయంగా తగ్గాయి. గత పదేళ్ల చరిత్రలోనే అత్యల్పంగా ఈ నెల 4వ తేదీ నాటికి కేవలం 26.51 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నట్లు సింగరేణి యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో (2014 నుండి 2024 మధ్య) గనులు, సీహెచ్పీల వద్ద సగటున 50 లక్షల టన్నుల నిల్వలు ఉండేవి. 2015-16లో 70 లక్షల టన్నులు, 2016-17లో 74 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు రికార్డయ్యాయి. వీటికి విరుద్ధంగా ప్రస్తుతం స్టాక్ సగానికి పడిపోయింది. సాధారణంగా వర్షాకాలంలో థర్మల్ కేంద్రాలకు నిరాటంకంగా సరఫరా చేయడానికి కనీసం 15 రోజులకు సరిపడా (30 లక్షల టన్నులు) బొగ్గు నిల్వలు ఉండటం అత్యవసరమని, తాజా పరిస్థితిని గమనిస్తూ రవాణాను క్రమబద్ధీకరిస్తున్నట్లు సంస్థ వివరించింది.

**'సైట్ విజిట్ సర్టిఫికేట్' ఎందుకు?** ఓవర్ బర్డెన్ (పై మట్టి) తొలగింపు టెండర్లలో 'సైట్ విజిట్ సర్టిఫికేట్' నిబంధనను ప్రవేశపెట్టడంపై యాజమాన్యం స్పష్టతనిచ్చింది.

**పనులు మధ్యలో ఆపేయడం వల్లే:** గతంలో కొందరు కాంట్రాక్టర్లు స్థానిక భౌగోళిక, సామాజిక పరిస్థితులపై అవగాహన లేకుండా టెండర్లు దక్కించుకొని, పనులను మధ్యలోనే వదిలేశారు (ఉదాహరణకు: శ్రీరాంపూర్ ఓసీ-2, ఐకే ఓసీ ప్రాజెక్టులు). దీనివల్ల సంస్థ ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతిన్నాయి.

**ఆరోగ్యకరమైన పోటీ కోసమే:**టెండర్ దారులు పని ప్రదేశం, భద్రతా ప్రమాణాలను ముందే అంచనా వేసి కచ్చితమైన రేట్లు కోట్ చేయడానికే మే 2025 నుండి ఈ నిబంధన తెచ్చారు. ఇది పోటీని తగ్గించడానికి కాదని స్పష్టం చేసింది. మంచి ఫలితాలు: ఎన్ఎండిసి, జిఎండిసి వంటి ప్రభుత్వ సంస్థల్లో ఇప్పటికే అమల్లో ఉన్న ఈ విధానం వల్ల ప్రస్తుతం సింగరేణిలో ఓబీ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా సాగుతున్నాయి.

**మెడికల్ బోర్డు అక్రమాలపై ఏసీబీ విచారణ తీవ్రం**కారుణ్య, డిపెండెంట్ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి మెడికల్ బోర్డులో జరుగుతున్న అక్రమాలపై యాజమాన్యం కఠినంగా వ్యవహరిస్తోంది. కార్మికులను మోసం చేస్తున్న దళారులపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో, సింగరేణి యాజమాన్యమే స్వయంగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు ఉద్యోగులను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేయగా, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఏసీబీ విచారణతో పాటు సింగరేణి విజిలెన్స్ విభాగం అంతర్గత విచారణను కూడా వేగవంతం చేసినట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ వెల్లడించారు.

# చర్చి గాగిల్లాపూర్‌లో దారుణం

● అక్రమ సంబంధం అనుమానంతో భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త! ● నిద్రిస్తున్న సమయంలో తలపై వేటు. ● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘోరం ● ఇద్దరు ఆడపిల్లలు ఉన్నా కరగని మనసు. ● నిందితుడు సంతోష్ కుమార్ చారి రిమాండ్‌కు






**దుండిగల్, జూన్ 6, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భార్యపై పెంచుకున్న అంధ అనుమానం ఒక నిండు ప్రాణాన్ని బలిగొనడమే కాకుండా, ఇద్దరు ఆడపిల్లలను అనాథలను చేసింది. భార్య వేరే వ్యక్తులతో మాట్లాడుతూ అక్రమ సంబంధం పెట్టుకుందనే నెపంతో, ఆమె నిద్రిస్తున్న సమయంలో భర్త గొడ్డలితో తలపై మోది కిరాతకంగా హత్య చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

**క్షణికావేశమా? ముందస్తు వ్యూహమా?:**పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్చి గాగిల్లాపూర్ ప్రాంతానికి చెందిన అయ్యగారి సంతోష్ కుమార్ చారి (44) అనే వ్యక్తికి, సంతోషి (38)తో ఇరవై ఒక్క సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం ఉన్నారు. అయితే గత కొంతకాలంగా భార్య సంతోషి ప్రవర్తనపై భర్త సంతోష్ కుమార్ చారి తీవ్ర అనుమానం పెంచుకున్నాడు. ఆమె వేరే వ్యక్తులతో మాట్లాడుతోందని, అక్రమ సంబంధం పెట్టుకుందని మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే శుక్రవారం సాయంత్రం సమయంలో సంతోషి తన ఇంట్లో నిద్రిస్తోంది. అదే సమయం చూసి లోపలికి వెళ్లిన భర్త, ఇంట్లో ఉన్న గొడ్డలిని తీసుకుని నిద్రిస్తున్న భార్య తలపై అత్యంత బలంగా కొట్టాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో సంతోషి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.

**నిందితుడు అరెస్ట్ - రిమాండ్‌కు తరలింపు** ఈ దారుణ హత్యోదంతంపై సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవపరీక్ష నిమిత్తం గాంధీ హాస్పిటల్ కి తరలించారు. ఈ ఘోరానికి పాల్పడిన నిందితుడు సంతోష్ కుమార్ చారిని పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా, భార్యపై ఉన్న అనుమానంతోనే తానే ఈ హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై హత్య కేసు నమోదు చేసిన అధికారులు, శనివారం అతడిని న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఇరవై ఏళ్లకు పైగా కలిసి సంసారం చేసిన భార్యను అనుమానంతో భర్తే కిరాతకంగా చంపడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది.

# శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానములో సీల్డ్ టెండరు-కం-బహిరంగ వేలం



**జగ్గయ్యపేట జూన్ 6 (వార్తప్రభ)** మండలం, వేదాద్రి గ్రామములో వేంచేసియున్న శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానముకు సర్వ సంపూర్ణ హక్కు భుక్తములు కలిగిన ఎన్.టి.ఆర్. జిల్లా, జగ్గయ్యపేట మండలం, వేదాద్రి గ్రామములోని కౌలు భూములు '9' బిట్లుకు గాను మొత్తం య.43.13 సెంట్లుకు జూన్ 11 గురువారం ఉదయం గం. 11.00 ల నుండి వేదాద్రి గ్రామములోని స్వామి వారి దేవాలయ కార్యాలయం నందు దేవదాయ శాఖ ఉన్నాతాధికారులు సమక్షములో సీల్డ్ టెండరు-కం-బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును, ఆసక్తి గలవారు ధరావత్తు చెల్లించి కౌలు వేలము పాటలలో పాల్గొనవచ్చును. అదేవిధముగా దేవస్థానముకు '1' సంవత్సర కాలపరిమితికి కిరాణా సరుకులు, పూలు-పూల దండలు, కూరగాయలు సరఫరా చేయుటకు జూన్ 11 గురువారం మధ్యాహ్నం గం. 1.00 ల నుండి టెండర్లు నిర్వహించబడును. టెండర్లలో పాల్గొనుటకు ఆసక్తి గల వారు జూన్ 10 వరకు దేవస్థాన కార్యాలయ పని సమయములలో సంప్రదించి టెండర్ డాక్యుమెంట్ కొనుగోలు చేసి సదరు టెండర్లలో పాల్గొనవచ్చునని దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త, డాక్టర్ వెలగపూడి లక్ష్మణఇందిరా దత్తు , దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలియజేసారు.

# ఘనంగా 'ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాలు'

## ఎన్ డబ్ల్యూ సి ఊడ్జిమ్ టీ ఆర్ 9 టీ వి, టీ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో...





**జవహర్ నగర్, జూన్ 6: (వార్తా ప్రభ)**ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండవ రోజు సైనిక్‌పురి పరిసర ప్రాంతాలలో పర్యావరణ వారోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు కాలనీ వాసుల సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పర్యావరణ రక్షకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ వి శ్రీ లక్ష్మీ మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రస్తుత కాలంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో పర్యావరణ ముప్పును తప్పించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. డాక్టర్ సునీత మాట్లాడుతూ, కేవలం మొక్కలు నాటడమే కాకుండా, అవి వృక్షాలుగా మారేంతవరకు పక్కా ప్రణాళికతో సంరక్షించాల్సిన బాధ్యత కూడా మనందరిపై ఉందన్నారు. వాతావరణ మార్పులపై అవగాహనగ్రీన్‌హౌస్ వాయువుల ప్రభావం, గ్లోబల్ వార్మింగ్ కారణంగా రుతుపవనాలలో తీవ్ర మార్పులు వస్తున్నాయని పర్యావరణ నిపుణులు హెచ్చరించారు. ఈ వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి పచ్చదనాన్ని పెంచడం ఒక్కటే సరైన మార్గమని స్పష్టం చేశారు. సమాజంలో పర్యావరణంపై నిరంతరం చర్చలు జరగడం, మాట్లాడడం ద్వారా ప్రజల్లో చైతన్యం వస్తుందని, తద్వారా సమాజంలో సానుకూల మార్పులు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు.

**భవిష్యత్ తరాలకు పచ్చని కానుక** మనం మన పిల్లల కోసం ఆస్తులు కూడబెట్టడం కంటే, స్వచ్ఛమైన గాలిని, నీటిని అందించే పచ్చని పర్యావరణాన్ని ఇవ్వడం ముఖ్యం. నేడు మనం తీసుకునే పర్యావరణ అనుకూల నిర్ణయాలే భవిష్యత్ తరాలకు మంచి, ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించిన వారం అవుతాము" అని వక్తలు భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక పార్కులు, ఖాళీ స్థలాలలో ప్రతినిధులు, ప్రజలు కలిసి మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడతామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో దొనీపూడి చక్రపాణి చీఫ్ గెస్ట్, తూర్పు రమేష్ టి ఆర్ 9 టీవీ చైర్మన్, ఎన్ డబ్ల్యూ సి,చైర్మన్ జనతా రాం,నిడమర్తి ఉదయ్ భాస్కర్, అజిత్, గడ్డం సిద్దు, చిగురుటి మనోజ్, రాజేష్, సురేష్, సౌజన్య స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, యువకులు పర్యావరణ ప్రేమికులు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# లోకరాజుకు పదోన్నతి...



**గుడ్లవల్లేరు:జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ...ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేస్తున్న బి.లోకరాజుకు తహసీల్దార్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన్ను ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ దుశ్శాలువాతో సన్మానించి అభినందించారు. డెప్యూటీ ఎంపీడీఓలు జి.ఎస్.ఎస్.అంజనాదేవి, వి.ఎలీషారావు తదితరులు ఉన్నారు.

# ధనిష్ట బత్తులకు ఎన్‌టీఆర్ లెజండరీ -2026 జాతీయ పురస్కారం

## మున్‌మున్ సేన్ చేతుల మీదుగా ప్రదానం




**విజయవాడ: జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**– తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టిపిసి) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన "ఎన్‌టీఆర్ లెజెండరీ నేషనల్ అవార్డ్స్-2026" ప్రదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ, రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన పలువురుకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ప్రపంచ దేశాల్లో తెలుగువారికి ఖ్యాతి తెచ్చిన ఎన్‌టీఆర్ మహానుభావుడని, చరిత్ర మరువని మహోన్నతుడని కొనియాడారు. ఈ సందర్భంగా ఆరోగ్య రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు ధనిష్ట బత్తులకు "ఎన్‌టీఆర్ లెజెండరీ నేషనల్ అవార్డ్-2026"ను ప్రదానం చేశారు. విజయవాడకు చెందిన ధనిష్ట బత్తుల ప్రస్తుతం నాగార్జున హాస్పిటల్‌లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆరోగ్య సేవల అభివృద్ధి, హాస్పిటల్ పరిపాలన, నాణ్యత ప్రమాణాల అమలు, రోగి భద్రత వంటి అంశాల్లో ధనిష్ట బత్తుల చేసిన సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ధనిష్ట బత్తుల మాట్లాడుతూ, ఎన్‌టీఆర్ లెజెండరీ జాతీయ పురస్కారం అందుకోవడం తాను గౌరవంగా భావిస్తున్నానని, ఇది తనపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌టిపిసి అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య జంగా, పీవీఎస్ వర్మలకు కృతజ్ఞతలు తెలిపారు. తన అపూర్వ విజయానికి సహకరించిన నాగార్జున హాస్పిటల్ యాజమాన్యం, సహచర సిబ్బంది, కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో లోక్‌సభ మాజీ సభ్యురాలు మున్‌మున్ సేన్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ డాక్టర్ జితేంద్ర మతలాని, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, బీజేపీ నాయకులు పాతూరి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై విశ్వభారతిలో 3 రోజుల శిక్షణా తరగతులు




**గుడివాడ,జూన్ 6 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక మరియు సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా మరియు కృష్ణా జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో గుడివాడ అగ్నిమాపక కేంద్ర పరిధిలోని విశ్వభారతి ఎడ్యుకేషనల్ సొసైటీ సిబ్బందికి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ప్రాథమిక అగ్నిప్రమాద నివారణ మరియు ప్రథమ చికిత్స శిక్షణా కార్యక్రమాన్ని శనివారం గుడివాడ సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి జె ఆంజనేయులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ సిబ్బందిలో భద్రతా అవగాహన పెంపొందించడం, అగ్నిప్రమాదాల సమయంలో సరైన నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణ నష్టం మరియు ఆస్తి నష్టాన్ని తగ్గించడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించిన ప్రాథమిక అంశాలతో పాటు అత్యవసర సమయాల్లో పాటించాల్సిన విధివిధానాలను నిపుణులు వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో అగ్నిప్రమాదాల కారణాలు, నివారణ చర్యలు, అగ్నిమాపక పరికరాల వినియోగం, అత్యవసర తరలింపు విధానాలు, ప్రథమ చికిత్స పద్ధతులు, మాక్ డ్రిల్స్ తదితర అంశాలపై సిద్ధాంతపరమైన మరియు ప్రాయోగిక శిక్షణ అందించబడుతుందని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కైకలూరు అగ్నిమాపక అధికారి కె. క్రాంతి కుమార్, శిక్షణ బోధకులుగా బి. శ్రీనివాసరావు (ఎల్ఎఫ్), జి. శ్రీనివాసరావు (ఎఫ్ఎం) పాల్గొన్నారు. అలాగే గుడివాడ అగ్నిమాపక కేంద్ర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని శిక్షణ నిర్వహణలో సహకరించారు.

## అనాధ తల్లికి అంతక్రియలు చేసి మానవత్వాన్ని చాటిన ఆర్కే వారియర్స్..!



**గుడివాడ,జూన్ 6 (వార్తాప్రభ) :** అనాధ వృద్ధ తల్లికి అంతక్రియలు చేసి మానవత్వాన్ని చాటిన గుడివాడ పట్టణ ఆర్కే వారియర్స్.! కృష్ణాజిల్లా గుడివాడ పట్టణ స్థానిక రైల్వే స్టేషన్లో రోడ్లో కొన్ని సంవత్సరాలుగా బిక్షాట్న చేసుకుంటూ జీవిస్తున్న వృద్ధురాలు సావిత్రమ్మ అనారోగ్యంతో చనిపోవడంతో ఆ తల్లికి ఎవరు లేకపోవడంతో పోలీసు వారి సమాచారంతో ఆ వృద్ధ తల్లి కి అన్ని తామై అంతక్రియలు చేసి మానవత్వాన్ని చాటిన గుడివాడ పట్టణ ఆర్కే వారియర్స్. ఈ సందర్భంగా గుడివాడ పట్టణ బిజెపి అధ్యక్షులు డాక్టర్ మాచర్ల రామకృష్ణ మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవ అనే నినాదంతో మా టీమ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు భాగంగా అనాధగా ఎవరు చనిపోకూడదని ఆలోచనతో వారికి అన్ని మేమే అంత్యక్రియలు చేయడం జరుగుతుందని తెలియజేశారు. సమాజ హితమే మా అభిమతంగా మార్చుకుని ప్రజలకు ఏదో విధంగా సహాయం చేయాలని మా వంతు సేవా కార్యక్రమాలు చేస్తున్నావని దయచేసి గుడివాడ పట్టణ ప్రజలు మా టీం ని మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతాజీ నైజం అత్తులూరి రవి కిరణ్, గాదే చరణ్ కుమార్, మరియు ఆర్కే వారియర్స్ పాల్గొన్నారు.

## ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణా తరగతులు



**గుడివాడ,జూన్ 6 (వార్తాప్రభ) :** స్థానిక శాఖ గ్రంధాలయం, రాజేంద్రనగర్ నందు సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం నిర్వహించడం అయినది. ఈ కార్యక్రమంలో వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం జరిగించడమైనది. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ రైల్వే ఉద్యోగి కోన రామారావు, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ రిటైర్డ్ ఉద్యోగి గుర్రం వెంకటేశ్వరరావు లు పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు పి. శాంతి పాఠకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**గుడివాడ,జూన్ 6 (వార్తాప్రభ) :** ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకి సహకా సుబ్బారావు సహకారంతో ఏలూరు రోడ్డు డివిఎస్ కాంప్లెక్స్ నందు ఉచిత మజ్జిగ మరియు ఉచిత మినరల్ కూలింగ్ వాటర్ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగినది ఈ కార్యక్రమానికి అధ్యక్షులు గంట చంద్రశేఖర్, సెక్రటరీ లక్ష్మీనారాయణ రెడ్డి, ట్రెజరర్ తాత భాస్కర్, ఎలెక్ట్ గవర్నర్ ఎం సిహెచ్ నారాయణ రెడ్డి మాజీ ఏవిపి బొగ్గవరపు తిరుపతయ్య మాజీ గవర్నర్ సరదా సుబ్బారావు మాజీ అధ్యక్షులు డి వి సత్యనారాయణ మహంకాళి వీర శేఖర్ పామర్తి కేశవరావు చిన్నం గంగాధర్ బత్తిని శ్రీనివాస్ మోహన్ రావు సీతారామస్వామి బచ్చు రాధాకృష్ణ సాంబశివ బ్రహ్మయ్య ఇతర వాకర్ సభ్యులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడం జరిగినది.

# కూటమి నేతల ఫోకస్ ప్రజలకు మంచి చేయడంపైనే..

- ప్రతిపక్షాల గాలి విమర్శలను 'ఐ డోంట్ కేర్'
- గుడివాడ హెడ్ వాటర్ వర్క్స్‌లో రూ.4.77 కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు..





**గుడివాడ,జూన్ 6 (వార్తాప్రభ) :** గుడివాడ నియోజకవర్గంలో ప్రజలకు మంచి చేయడం పైనే కూటమి పార్టీల ఫోకస్ ఉంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రతిపక్షాల గాలి విమర్శలను 'ఐ డోంట్ కేర్' అంటూ ఆయన తిప్పికొట్టారు. గుడివాడ హెడ్ వాటర్ వర్క్స్‌లో రూ.4.77 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ఉదయం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.13 కోట్లతో 500 కెఎల్ సామర్థ్యం గల క్లియర్ వాటర్ సంపు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అమృత్ ఫేజ్-2 నిధులు రూ.3.64 కోట్లతో నిర్మాణం పూర్తిచేసుకున్న 12 ఎంఎల్‌డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించేందుకు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. 6 నెలల్లో వాటర్ సంపు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. నూతన సంపు నిర్మాణంతో హెడ్ వాటర్ వర్క్స్ 55వేల కుటుంబాలకు సరిపడా నీటి సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం గుడివాడ పట్టణంలో 35వేల కుటుంబాలు ఉన్నాయని అధికారులు అంచనా వేశారని, భవిష్యత్తు తరాలకు కూడా నీటి కొరత ఉండదన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే రాము, కేంద్ర నిధులు 2018లోనే విడుదలైనా, ప్లాంట్ నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉన్నా కొడాలి నాని కేవలం పబ్లిసిటీ కోసం ట్యాంకర్లు తిప్పుతూ పనులను అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాల గాలి విమర్శలను 'ఐ డోంట్ కేర్' అంటూ తిప్పికొట్టారు. తనకు క్రెడిట్ కాదు, ప్రజలకు మంచి జరగడమే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ డబ్ల్యూ సి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, మార్కెట్ ఆడ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, మున్సిపల్ ఎంఈ ప్రసాద్, పబ్లిక్ హెల్త్ ఈ. ఈ ప్రవీణ్, డీ.ఈ పాండురంగ, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు, కార్పొరేషన్ డైరెక్టర మజ్జాడ నాగరాజు, డాక్టర్ గోర్జి సత్యనారాయణ, దారపు రెడ్డి మనీశ్వరరావు, వేశపోగు ఇమ్మానుయేలు, డేవిడ్, కోలా నెహ్రూ, కొడాలి రాజా, వడ్డాది నాగరాజు, రెడ్డి అప్పారావు, ప్రశాంతి, అందుగుల ఏసు పాదం, మిక్కిలినేని రమేష్, ప్రశాంతి, అనిల్, గూడపాటి రాజు, మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు, సచివాలయ కార్యదర్శులు, హెడ్ వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# యోగా ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం

-- ANRCETలో ప్రత్యేక అవగాహన సదస్సు



**గుడివాడ,జూన్ 6 (వార్తాప్రభ) :** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు -2026 సందర్భంగా గుడివాడలోని అక్కినేని నాగేశ్వరరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ లో ప్రత్యేక యోగా అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని విజయవాడకు చెందిన యోగ శక్తి సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆక్యుపంక్చర్ నిపుణులు, యోగా శక్తి సాధన సమితి వ్యవస్థాపకులు మరియు చైర్మన్ డా॥ మాకల సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు యోగా, ప్రాణాయామం, ధ్యానం, ఆక్యుపంక్చర్ మరియు సహజ ఆరోగ్య విధానాల ప్రాముఖ్యతను వివరించారు. నేటి యువత ఎదుర్కొంటున్న ఒత్తిడి, ఆందోళన, జీవనశైలి వ్యాధులను యోగా సాధన ద్వారా అధిగమించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమ యొక్క సందేహాలను నివృత్తి చేసుకున్నారు. విద్యార్థుల యొక్క నాడి పరిశీలించి ఆరోగ్య పరిస్థితికి తగిన సూచనలను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరిగ రామారావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. విద్యతో పాటు ఆరోగ్యాన్ని కూడా సమానంగా పరిరక్షించుకోవడం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం -2026 వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని (బ్రోచర్‌ను) డా. మాకల సత్యనారాయణ, అక్కినేని నాగేశ్వరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరిగ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ బి.ఎస్.ఎస్. పద్మజ ల చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల అధ్యక్షులు ఎల్.ఆర్.కె. ప్రసాద్ ప్రముఖ ఆక్యుపంక్చర్ నిపుణులు, యోగ శక్తి సాధన సమితి చైర్మన్ డా. మాకల సత్యనారాయణ ని శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. యోగా, సహజ వైద్యం, ఆక్యుపంక్చర్ రంగాలలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను కొనియాడుతూ కళాశాల తరఫున అభినందనలు తెలిపారు.

# మనిషికి గుండె ఎంత అవసరమో...

- స్కూల్స్ కి, కాలేజీకి యూనివర్సిటీకి లైబ్రరీ కూడా అంతే అవసరం - డిఇఓ ఎల్ చంద్రకళ
- ఘనంగా ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం.





**విజయవాడ,జూన్ 6 (వార్తాప్రభ) :** స్థానిక మహాత్మా గాంధీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో గత 40 రోజులుగా జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం నేటితో ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ జిల్లా డీఈవో ఎల్ చంద్రకళ హాజరై నారు. ఒక విశిష్ట అతిథిగా 23 వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి పాల్గొన్నారు. యూపీఎస్ ఫ్యాకల్టీ చంద్రిక ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. గ్రంథాలయాధికారి కే. రమాదేవి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడింది. ముందుగా విచ్చేసిన ముఖ్య అతిథులతో కేక్ కట్ చేయించారు. అనంతరం విద్యార్థులు ఈ 40 రోజుల శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న నృత్య ప్రదర్శన చేశారు. ముఖ్యఅతిథి డీఈఓ చంద్రకళ మాట్లాడుతూ ఒక మనిషి శరీరంలో చాలా రకాల పార్ట్ లు ఉన్నాయి. ఒక కన్ను కనపడకపోతే ఇంకొక కన్నుతో చూడగలుగుతాము కానీ హార్ట్ లేకపోతే మనిషి జీవితమే లేదన్నారు. అలాగే ప్రతి స్కూల్ కి, కాలేజీకి యూనివర్సిటీ కి లైబ్రరీ గుండె కాయ లాంటిదన్నారు. లైబ్రరీ లేకపోతే ఆ కాలేజీ గాని, స్కూలు గాని జీవచ్ఛవంతో సమానం అన్నారు. ఇక్కడ వచ్చిన తల్లిదండ్రులు అందరికీ నేను తెలియజేసేది ఏమనగా ప్రతి ఊరిలో వీధిలో ఏ ఏరియాలో అయినా గ్రంథాలయాలు ఎక్కడ ఉన్నవో తెలుసుకొని వాటికి పిల్లలని తీసుకువెళ్లటం అలవాటు చేసుకోండన్నారు. సెలవు రోజు వస్తే పార్కు కో సినిమాకు టీవీకో ఫోన్ కో అంకితం కాకుండా లైబ్రరీ ఎక్కడ ఉందో తెలుసుకొని తీసుకు వెళ్ళటం అలవాటు చేయండన్నారు. గ్రంథాలయాలు ఇదివరకి లాగా లేవనీ, ఇప్పుడు ఎంతో అభివృద్ధి చెందినాయన్నారు. ఈరోజు ఇంతమంది విద్యార్థులు ఇక్కడ ఎంతో వినూత్నంగా అనేక కార్యక్రమాల్లో పాల్గొని ఎన్నో విషయాలను నేర్చుకున్నారన్నారు. అలాగే తక్కువ సమయంలోనే డాన్స్ నేర్చుకునిఎంతో అద్భుతంగా చేశారని చిన్నారులను అభినందిస్తూ మంచి లైబ్రరీ ఎక్కడ ఉందని తెలుసుకొని మీ అందరి ద్వారా సమాజంకి తెలియజేయాలని కోరారు. ఇంకొక విశిష్ట అతిథి బాలస్వామి మాట్లాడుతూ గ్రంథాలయం అంటే జ్ఞానమని పుస్తకం అనేది విద్యార్థికి ప్రియమైన నేస్తం అని పుస్తకం చదివితే చాలా జ్ఞానం వస్తుందని తెలియజేశారు. వేసవి విజ్ఞాన శిబిరం పిల్లలు వాళ్ల సమయాన్ని వృధా చేయకుండా ఎన్నో మంచి అంశాలు నేర్చుకున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవివి ప్రసాద్, ఏ ఎల్ ఎస్ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష ఎన్టీఆర్ జిల్లా, రిసార్ట్ పర్సన్స్ వీ.సుమతి , ఎం వరలక్ష్మి , దుర్గ భవాని, దేవ్ కుమార్ , సైరాబాను , కుసుమ , సౌందర్య, చైత్రిక మరియు వనజ గారు వీరందరినీ చూసి డీఈవో మేడం మరియు బాలస్వామి, చంద్రిక, ప్రసాద్ సత్కరించారు. 10 అంశాలలో శిక్షణ పొంది పోటీలలో గెలుపొందిన 100 మంది విద్యార్థులకు బహుమతి ప్రధాన ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వైదన, లక్ష్మి, డి నాగేశ్వరరావు, ఎం వెంకటేశ్వర్లు, వివిధ స్కూల్స్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఫుట్ పాత్‌ల ఆక్రమణలపై కమిషనర్ కొరడా

- జీజీహెచ్ ప్రాంతంలో విస్తృత తనిఖీలు
- రోడ్డుపై వ్యాపారాలకు అడ్డుకట్ట



**కాకినాడ,జూన్ 6 (వార్తాప్రభ) :** కాకినాడ నగరంలో ఫుట్‌పాత్‌లు, రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ కఠిన చర్యలు చేపట్టారు. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్) పరిసర ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. పర్యటన సందర్భంగా ఆర్టీసీ నాన్‌స్టాప్ కేంద్రం నుంచి జిల్లా పరిషత్ సెంటర్ వరకు ఉన్న ఫుట్‌పాత్‌లపై వ్యాపారులు ఆక్రమణలు చేసి రహదారిపైకి వచ్చి వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ గుర్తించారు. దీంతో వెంటనే ప్రత్యేక బృందాలతో కలిసి ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, అక్రమంగా ఏర్పాటు చేసిన టేబుళ్లు, తోపుడు బండ్లు, కుర్చీలు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఫుట్‌పాత్‌లపై నిర్మించిన తాత్కాలిక కట్టడాలను కూడా కమిషనర్ స్వయంగా పర్యవేక్షిస్తూ తొలగింపజేశారు. జీజీహెచ్ ప్రాంతంలో రోజూ వేలాది మంది రోగులు, వారి బంధువులు,సాధారణ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. నగరంలో ఎక్కడైనా ఫుట్‌పాత్‌లు, రహదారులు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.నగర సౌందర్యం,ట్రాఫిక్ నిర్వహణ, ప్రజల భద్రత దృష్ట్యా ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ శానిటేషన్ ఇన్స్పెక్టర్ సత్తిబాబు,ఏ. ఈ ఆదినారాయణ,సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తుల దాహార్తి నిమిత్తం చల్లని మజ్జిగ పంపిణీ శిబిరం



**గుడివాడ,జూన్ 6 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా గుడివాడ -పాటిమీద జగన్నాధపురం లో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు భక్తులు మరియు బాటసారులకు వేసవి తాపం నుండి విముక్తి కొరకు దాహార్తి తీర్చు నిమిత్తం ఏర్పాటు చేయబడిన చలివేంద్రం నందు శనివారం సందర్భంగా ఏలూరు వాస్తవ్యులు సూరపురెడ్డి వెంకట సుబ్బలక్ష్మి వారి కుమారులు ఫణి కేశవ, నాగావంశీ చల్లటి మజ్జిగను భక్తులకు ఉచితంగా పంపిణీ చేసి ఉన్నారు. ఈ కార్యక్రమమును ధర్మకర్తల మండలి చైర్మన్ లింగం శివరాం ప్రసాద్ దాతతో కలిపి ప్రారంభించడం జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణు గోపాలరావు మాట్లాడుతూ దాహార్తిని తీర్చాలి అనే సహృదయంతో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని దాతను ప్రత్యేకంగా అభినందించి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండల సభ్యులు నిమ్మగడ్డ వెంకట కృష్ణారావు, చందు శ్రీనివాసరావు, జోగి సాంబశివరావు పి. రాజేశ్వరరావు, గూడపాటి సుజాత, విజయలక్ష్మి, వేదాంతం కృష్ణవేణి మరియు శ్రీ విజయ దుర్గ దేవస్థానం చైర్మన్ బోడబాల్ల హరిబాబు దంపతులు, కోడూరు ప్రభు అధిక సంఖ్యలో భక్తులు సిబ్బంది పాల్గొన్నారు.

## హోరాహోరీగా సాగుతున్న క్రికెట్ పోటీలు..

- రావెళ్ళ కృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్.



**చల్లపల్లి/అవనిగడ్డ,జూన్ 6 (వార్తాప్రభ) :** దివంగత నేత రావెళ్ళ కృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి.ఆర్ కె కన్వెన్షన్ అధినేత,రావెళ్ళ కృష్ణ సేవా సమితి అధ్యక్షులు రావెళ్ళ ఉదయ్ కుమార్ తమ తండ్రి పేరిట రావెళ్ళ కృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణా జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ వేదికగా ఆటలో తమ సత్తా చాటుతూ తమలోని క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు.లోకల్ టాలెంట్ కు వేదికగా నిలుస్తున్న టోర్నమెంట్ విద్యార్థులు,యువతలో క్రీడల పట్ల ఆసక్తి కలిగిస్తోందని చెప్పవచ్చు.వేసవి శెలవులకు తోడు టోర్నమెంట్ జరుగుతున్న మైదానంలో టెంట్లు, చల్లని మంచినీరు సహా మెరుగైన సౌకర్యాలు నిర్వాహకులు ఏర్పాటు చేయడంతో పోటీలు తిలకించేందుకు వయోభేదం లేకుండా అధిక సంఖ్యలో వీక్షకులు హాజరవుతుండటంతో టోర్నమెంట్ ప్రజాదరణ పొందిందని చెప్పవచ్చు.శనివారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్లో మాజేరు జట్టుపై మంగళాపురం జట్టు విజయం సాధించి సెమీ ఫైనల్ కు చేరింది.మంగళాపురం జట్టులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కిషోర్ ను నిర్వాహకులు రావెళ్ళ ఉదయ్ కుమార్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మెమెంటో తో సత్కరించారు.ఆదివారం ఉదయం జరిగే సెమీఫైనల్లో నాలుగు జట్లు తలపడనున్నాయి.సెమీఫైనల్ లో విజయం సాధించిన రెండు జట్లు మధ్యాహ్నం జరిగే ఫైనల్ మ్యాచ్ లో తలపడనున్నాయి.సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు మరింత ఎక్కువమంది హాజరయ్యే అవకాశం ఉండటంతో ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

## కానుమోలు శాఖ గ్రంధాలయం నందు వేసవి శిక్షణ తరగతులు ముగింపు



**హనుమాన్ జంక్షన్, జూన్ 6 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా గ్రంధాలయ సంస్థ ఆధ్వర్యంలో కానుమోలు శాఖ గ్రంధాలయం నందు గత 40 రోజులుగా నిర్వహించుచున్న వేసవి శిక్షణ తరగతుల నిర్వహణ ముగింపు సందర్భంగా విద్యార్థిని విద్యార్థులను గ్రంథాలయాలు వైపు ఆకర్షితులు చేయుటకుగాను శిక్షణ కాలంలో నిర్వహించిన యోగ , క్యారమ్స్ కబడ్డీ ఏడు పెంకులు ఆట కంప్యూటర్ ప్రోగ్రామ్స్ చదరంగం డ్రాయింగ్, మరియు వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలకు గాను 35 మంది విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు ఒ ఏపీ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గరికిపాటి శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు వారంలో ఒక్కరోజున గ్రంథాలయం సందర్శించాలని వేసవి శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన సిబ్బందిని అభినందించారు. అనంతరం గన్నవరం నియోజకవర్గ తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు చిన్నం శ్రీదేవి మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న కంప్యూటర్ లు ఉపయోగించుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చరవాణిని వీడాలని సెలవులలో గ్రంథాలయాలని తప్పక ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సుంకర సాంబశివరాయల్ జనసేన పార్టీ నాయకులు బండి రామాంజనేయులు, గ్రామ బీసీ సెల్అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## టెస్టు బుక్స్ పంపిణీ చేసిన ఎం. ఈ.ఓ. డి రవీంద్ర



**పెనుగంచిప్రోలు,జూన్ 6 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ అధికారి డి రవీందర్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుల సమక్షంలో మండలంలోని అన్ని పాఠశాలలకు టెక్ట్స్ బుక్స్ ను శనివారం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఆర్సి సిబ్బంది మరియు ప్రధానోపాధ్యాయులు పాల్గొనడం జరిగింది. అదే విధంగా జూన్ 12న పాఠశాలల్లో పున ప్రారంభం అవుతాయని మండల విద్యాశాఖ అధికారి డి రవీంద్ర తెలియజేశారు..

# వామ్మో...ప్రైవేట్ దోపిడి...!

## మైలవరం పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థలు నిలువు దోపిడి

● స్కూల్లోనే పుస్తకాలు కొనాలని పేరెంట్స్ ని ఒత్తిడి చేస్తున్న పాఠశాలల యాజమాన్యాలు
● పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల స్టాల్స్ ఏర్పాటు ● విద్యాశాఖ అధికారులు అమ్ముడు పోయారంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు ● పట్టించుకోని ఉన్నత విద్యాశాఖ అధికారులు



**మైలవరం,జూన్ 6 (వార్తాప్రభ) :** ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పూర్తి స్థాయి వసతులున్న పాఠశాలలను వేళ్లమీదే లెక్కపెట్టవచ్చు.సరైన మౌలిక వసతులు లేక,విద్యార్థులకు సరిపడా ఆటస్థలాలు లేక , తరగతి గదుల కొరత వంటి సమస్యలు ఉన్నప్పటికీ, విద్యా శాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు.ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా యాజమాన్యాలు ఫీజుల వసూళ్లలో మాత్రం తగ్గేదేలే అంటున్నారు.ఇది చాలదన్నట్లు పుస్తకాల పేరుతో తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారు.నిబందనల ప్రకారం ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి.దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్యను బట్టి ఎంఈవో కార్యాలయం ద్వారా వీరు పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి.నోటు పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టి తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమకు సంబందించిన పాఠ్యపుస్తకాలకు, నోటు పుస్తకాలకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు నగదు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ధరలు రూ.250 నుంచి రూ. 650 వరకు ఉన్నాయి. వీటికి తోడు అదనంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది.8,9,10 తరగతులకు నోటు పుస్తకాల ఖర్చు కాస్త ఎక్కువగా ఉన్నా గరిష్ఠంగా రూ.1500 లకు మించి ఉండదు.అన్ని కలిపి పుస్తకాల ఖర్చు రూ.2 వేలకు మించి ఉండదు.అయితే ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి.నర్సరీ, ఎల్ కె జి, యు కె జి తరగతులకే రూ.7 వేలు వసూలు చేస్తుండగా, 8,9,10 తరగతులకు రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు.దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కూలీ నాలి చేసైనా పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్న తపన తల్లిదండ్రులలో ఉన్నా వారికి పాఠశాలల్లో పుస్తకాలు కొనుగోలు పెనుభారంగా మారింది. దీంతో ఏంచేయాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నారు.విద్యార్థులకు అవసరం లేని స్టడీ పాఠ్యపుస్తకాలు, మెటీరియల్, నోట్ పుస్తకాలను విక్రయిస్తుండటం వల్ల తల్లిదండ్రులపై ఆర్థికభారం పడుతోంది.విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు స్టడీ మెటీరియల్ అంటూ విద్యార్థులకు అంటగడుతున్నారు. పాఠ్యపుస్తకా ల్లోని పాఠ్యాంశాలను ఉపాధ్యాయులచే చెప్పించి నోట్స్ రాయించాల్సిన యాజమాన్యాలు స్టడీ మెటీరియల్ అంటూ రూ.వేలల్లో వసూలు చేస్తున్నారు.

**విద్యాశాఖ అధికారులు అమ్ముడు పోయారు:** ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలు స్కూల్స్ లోనే బుక్ స్టాల్స్ ఏర్పాటు చేసి తమ పాఠశాలలోనే పుస్తకాలు కొనాలని ఒత్తిడి చేస్తున్నా స్థానిక మండల స్థాయి విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదంటే కనీసం జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోవడం పట్ల తల్లిదండ్రులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.వీరంతా ప్రైవేటు,కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యా లకు అమ్ముడుపోయి ఉంటారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

**నిబంధనలు :** ఏ ప్రైవేట్ పాఠశాల కూడా విద్యార్థుల తల్లిదండ్రులను తమ వద్దే పుస్తకాలు, నోట్‌బుక్స్, లేదా యూనిఫారాలు కొనాలని ఒత్తిడి చేయకూడదు.? పాఠశాలలు కేవలం సిలబస్ మరియు అవసరమైన పుస్తకాల జాబితాను (Book List) మాత్రమే నోటీస్ బోర్డుపై పెట్టాలి. తల్లిదండ్రులు వాటిని బయట మార్కెట్‌లో ఎక్కడైనా కొనుగోలు చేసుకునే స్వేచ్ఛ ఉంది. అయినప్పటికీ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈ నిబంధనలు ఏమీ పట్టించుకోవడం లేదు.మండల స్థాయిలో చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉత్సవ విగ్రహా లుగా మిగిలిపోతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశా లల్లో పుస్తకాల పేరు తో చేపడుతున్న వసూళ్ల దందాను అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎన్టీఆర్ జిల్లాల్లోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలను అతిక్రమిస్తున్నా యి.మరికొద్ది రోజుల్లో వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు తెరుచుకోబోతు డటంతో విద్యావ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లబోతోంది.వీధి వీధికో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్న తరుణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తామని ఆకర్షణీయమైన ప్రకటనలు గుప్పిస్తున్న యాజమాన్యాలు.ఆచరణలో మాత్రం వాటిని గాలికి వదిలేస్తున్నాయి.స్కూల్లోనే పుస్తకాలు కొనాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారు. ఏకంగా స్కూళ్లలోనే స్టాల్స్ ఏర్పాటు చేశారు.బుక్స్ తో పాటు యూనిఫాం, టై, బెల్టులు తమ వద్దనే కొనాలంటున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం,టై, బెల్టులుఅమ్మకాలతో ప్రైవేట్ పాఠశాలలు బయట దుకాణాలను తలపిస్తున్నాయి. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా మార్చారు.విద్య అనే వ్యాపార ముసుగులో విద్యార్థుల తల్లిదండ్రులను కొట్టుమిట్టు లాడుతు న్నారు.అక్షరాలు నేర్పని నర్సరీ పిల్లలకు కూడా వేలకు వేలు డబ్బులు కట్టించుకొని పుస్తకాలు అంటగడు తున్నారు.ఇంత జరుగుతున్నా జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.




# సీబీసీ ఆధ్వర్యంలో అమ్మ పేరిట మొక్క కార్యక్రమం






**ఏలూరు,జూన్ 6 (వార్తాప్రభ) :** సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వట్లూరు గ్రామ పరిధిలో "ఏక్ పేడ్ మా కే నామ్" (అమ్మ పేరిట మొక్క) కార్యక్రమం జరిగింది. వట్లూరు సంకల్పం పార్కులో జరిగిన కార్యక్రమంలో సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ రావులపల్లి రమేష్ చంద్ర మాట్లాడుతూ, వాతావరణ మార్పులపై భారత ప్రభుత్వం ప్రతిపాదించిన మిషన్ లైఫ్ ఉద్యమంలో భాగంగా సుస్థిరమైన, పర్యావరణ అనుకూల దైనందిన జీవన శైలి అవసరాన్ని తెలిపారు. జపాన్ కు చెందిన మియావాకి పద్ధతిలో స్థానిక ప్రజాతులతో కూడిన, పట్టణ అటవీకరణ కోసం వివిధ అవసరాలకు ఉపయోగపడే మొక్కలను పార్కులో నాటారు. అమ్మ పేరిట మొక్క నాటే కార్యక్రమంలో ఏలూరు జీఎస్టీ సూపరింటెండెంట్ గుత్తా తులసి, రైతు సాధికార సంస్థ సలహాదారు ఆర్ అరుణ, మహిళా శిశు సంక్షేమ శాఖ సలహాదారు గారపాటి రోజా, ప్రముఖ హై కోర్ట్ న్యాయవాది జవ్వాజి శరత్ చంద్రలతో పాటు మహిళలు, పిల్లలు, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గేదెలను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

● ప్రమాదంలో నాలుగు గేదెలు మృతి ● గేదెల యజమానిపై కేసు నమోదు







**జి.కొండూరు,జూన్ 6 (వార్తాప్రభ) :** రహదారిపై ఉన్న గేదెలను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో నాలుగు గేదెలు మృతి చెందిన ఘటన జి.కొండూరు మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ శివారు 30వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 5వ తేదీ శుక్రవారం రాత్రి సమయంలో ఎన్ హెచ్-30 పై వదిలివేసిన నాలుగు గేదెలను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయని తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రహదారిపై మృతి చెందిన ఉన్న గేదెల ను పక్కకు తొలగించి రాకపోకలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకు న్నారు.విచారణలో సదరు గేదెలు వెల్లటూరు గ్రామానికి చెందిన మారం రాంబాబు అనే వ్యక్తివిగా గుర్తించారు.మేత కోసమని పశువుల ను ఎవరి పర్యవేక్షణ లేకుండా వదిలివేయడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు.ఈ విషయమై సదరు యజమానిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ కె. సతీష్ కుమార్ తెలిపారు.రాత్రి వేళ రహదారుల పై తిరిగే పశువుల కారణంగా వాహనదారులకు, పశువులకు రెండింటికీ ప్రాణాపాయం కలుగుతోం దని,గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు అనేకం జరిగాయన్నారు.

**పశువులపై పర్యవేక్షణ ఉండాలి :** పశువుల యజమానులు తమ పశువులను పర్యవేక్షణ లేకుండా రహదారులపై వదలకూడదని, ఎలా ఎవరైనా వదిలినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానిక ఎస్ఐ కె. సతీష్ కుమార్ హెచ్చరించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారులపై, జాతీయ రహదారుల వెంట వదిలివేయరాదని, ఇలా వదిలివేయడం వల్ల పెనుప్రమాదాలు జరిగి, వాహనదారుల ప్రాణాలతో పాటు పశువుల ప్రాణాలు కూడా పోతున్నాయన్నారు. పశువుల ను తగిన పర్యవేక్షణలో, సురక్షిత ప్రదేశాల్లోనే ఉంచాలని పోలీస్ వారి హెచ్చరికను పాటించని వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టంచేశారు.ప్రజలందరూ సహకరించాలని కోరారు.

# ఏపి ఉద్యోగుల సంక్షేమ నిధి రాష్ట్రస్థాయి కమిటీని వెంటనే నియమించాలి

● ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నేతలు డిమాండ్



**విజయవాడ,జూన్ 6 (వార్తాప్రభ) :** "ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంక్షేమ నిధి (ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఫండ్)" స్టేట్ లెవెల్ కమిటీని వెంటనే ప్రభుత్వం నియమించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం విజయవాడలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ, రమేష్‌కుమార్‌లు మాట్లాడుతూ, రాష్ట్ర విభజన నాటి నుండి అనగా 2014 నుండి నేటి వరకు ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంక్షేమ నిధి స్టేట్ లెవెల్ కమిటీని ప్రభుత్వాలు నియమించలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో విభజన నాటికి మూలధనం (కార్పస్ ఫండ్)లో ఏపీకి రావాల్సిన 58శాతం వాటా వచ్చిందో లేదో, ఆ నాటికి మంజూరు చేయబడిన అప్పులు, వాటి చెల్లింపులు, నేటి స్థితి ఆ వివరాలేవీ నాటి నుండి నేటటి వరకు ప్రభుత్వం వెల్లడించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంక్షేమ నిధి రూల్స్ 1980 ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ రాష్ట్ర స్థాయి కమిటీ సభ్యులతో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంక్షేమ నిధి స్టేట్ లెవెల్ కమిటీని ప్రతి క్యాలెండర్ సంవత్సరానికి నియమించాల్సి ఉందని, సదరు కమిటీ ద్వారా మాత్రమే ఫండ్ మేనేజ్‌మెంట్ జరగాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రతి ఏటా మూలధనంపై వడ్డీతో పాటు, ప్రభుత్వం ఇచ్చిన మ్యాచింగ్ గ్రాంట్ మూలధనం ఖాతాకి జమచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మేనేజింగ్ కమిటీ నిబంధనల ప్రకారం ఉద్యోగుల పిల్లలు పెద్ద చదువుల నిమిత్తం, అనారోగ్య పరిస్థితుల్లో రాష్ట్ర స్థాయిలో రూ.50 వేలు, జిల్లా స్థాయిలో రూ.5వేలు అర్హతలను బట్టి సదరు రాష్ట్ర కమిటీ ద్వారా మంజూరు కావాల్సి ఉందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై రాష్ట్ర విభజనకు ముందు 2013లో ఏర్పాటు చేసిన కమిటీ తరువాత నేటి వరకు కమిటీ ఏర్పాటు చేయలేదని, సమావేశం నిర్వహించలేదని పేర్కొన్నారు. సదరు ఫండ్ మేనేజ్‌మెంట్ ఎవరు నిర్వహిస్తున్నారో, ఎలా నిర్వహిస్తున్నారో, అప్పులు ఏమి మంజూరు చేశారో, బాకీలు ఎంత వసూలు చేశారో తదితర విషయాలేవీ బహిర్గతం కాలేదు. ఇది ఉద్యోగుల సొమ్ము. ఏటా ఉద్యోగుల జీతం లోంచి చందాలు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా ఏపిఎన్జీవోస్ అసోసియేషన్, ఏపి జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఏపి పంచాయతీ రాజ్ టీచర్స్ యూనియన్, ఏపి వెహికల్స్ డ్రైవర్స్ సెంట్రల్ అసోసియేషన్, ఏపి స్టేట్ టీచర్స్ యూనియన్ లాంటి కొన్ని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం విశ్రాంత గృహాలు కట్టుకోవడానికి అంటూ ఉద్యోగుల సొమ్ములో నుంచి 6శాతం వడ్డీతో 5ఏళ్ల కాల వ్యవధిలో తిరిగి చెల్లించే షరతు మీద మంజూరు చేసిన మొత్తం సదరు సంఘాలు నేటికీ చెల్లించలేదని, చెల్లించకపోగా, ఉద్యోగుల జీతాల్లో నుంచి మినహాయించుకోమంటూ వారు ప్రభుత్వానికి దరఖాస్తు చేస్తే, ఆ మేరకు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఉమ్మడి రాష్ట్రంలోని హైకోర్టు చెల్లదని కొట్టివేయడం జరిగిందన్నారు. సదరు బాకీలను వారికి లోను మంజూరు చేసినప్పుడు చేసిన షరతులతో వారి నుంచే వసూలు చేయాలని తీర్పు ఇచ్చినా, నేటికి వసూలు చేయకపోవడంతో సదరు బాకీలు వడ్డీతో కలుపుకొని ఐదున్నర కోట్ల రూపాయలకు చేరాయని తెలిపారు. ఈ విషయాలన్నీ దాచిపెట్టి ప్రభుత్వం సదరు సంఘాలు, పుష్కరకాలంగా "ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంక్షేమ నిధి స్టేట్ లెవెల్ కమిటీ నియమించకుండా, సమావేశం నిర్వహించకుండా మౌనం వహిస్తూ సదరు సంక్షేమ నిధికి చట్టబద్ధమైన హక్కుదారులైన ఉద్యోగులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా విషయాల్లో ప్రభుత్వం అలసత్వం వహిస్తే ఉద్యోగుల సొమ్ముకు వాటిల్లిన నష్టాన్ని కాపాడే క్రమంలో అవసరమైతే సదరు అధికారులను బాధ్యులుగా చేస్తూ న్యాయ పోరాటం చేయడానికి కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సిద్ధంగా ఉందని హెచ్చరించారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకున్న నూతన తాసిల్దార్..

### అనంతరం తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన రవీంద్రనాథ్





**పెనుగంచిప్రోలు, జూన్ 6 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండల తహసీల్దార్ (ఎఫ్.ఎస్.సి.) ఎస్ వి. రవీంద్రనాథ్ శని వారం ఉదయం శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వీరికి ఆలయ అధికారులు వేద పండితుల ఆశీర్వచనం, స్వామి వారి శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.అనంతరం పెనుగంచిప్రోలు తహసీల్దార్ గా బాధ్యత లు స్వికరించారు. ఇంతకు ముందు వీరు నందిగామ ఆర్డిఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ గా పని చేసి ఇపుడు పెనుగంచిప్రోలు ఇంచార్జ్ తహసీల్దార్ గా బాధ్యత లు స్వీకరించారు. ఈ రోజే విధుల్లో చేరారు.ఈ సందర్భంగా తహసీల్దార్ కు కార్యాలయ సిబ్బంది ఆహ్వానిస్తు స్వాగతం పలికారు....

# మొక్కను నాటడం ప్రారంభం మాత్రమే... దానిని వృక్షంగా తీర్చిద్దడమే నిజమైన విజయం...

● పచ్చని భవిష్యత్తు కోసం సమగ్ర ప్రణాళిక -- 'నందిగామ సంకల్పం -- హరితవనం' ● సంకల్పం మనది... పచ్చని భవిష్యత్తు భావితరాలది...



**నందిగామ,జూన్ 6 (వార్తాప్రభ) :** నియోజకవర్గాన్ని పచ్చదనంతో పరిపుష్టమైన ఆదర్శ హరిత నియోజకవర్గంగా తీర్చిద్దే లక్ష్యంతో రూపొందించిన "నందిగామ సంకల్పం-- హరితవనం" సమగ్ర కార్యాచరణ ప్రణాళిక నివేదికను రూపకర్త కత్తురోజు శ్రీనివాసాచారి శనివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ విప్ & శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్యకు అందజేశారు. ఈ సందర్భంగా రూపకర్త శ్రీనివాసచారి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెరుగు తున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులు, తగ్గుతున్న పచ్చదనం, భూగర్భ జలాల క్షీణత వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, నందిగామలో విస్తృత స్థాయిలో మొక్కల పెంపకం చేపట్టేందుకు ఒక ఆచరణాత్మక కార్యాచరణ పథకంగా ఈ ప్రణాళికను రూపొందించినట్లు శ్రీనివాసాచారి తెలిపారు.ఈ గ్రంథంలో మొక్కల నాటడం మాత్రమే కాకుండా, వాటి సంరక్షణ, గ్రామాల వారీ లక్ష్యాలు, మహిళా సంఘాల భాగస్వామ్యం, విద్యార్థుల పాత్ర, వాలంటీర్ వ్యవస్థ, డిజిటల్ మానిటరింగ్, నెలవారీ సమీక్షలు, ప్రోత్సాహక కార్యక్రమాలు వంటి అంశాలను సమగ్రంగా పొందుపరిచారు.ఇప్పటివరకు భారతదేశంతో పాటు ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన హరిత కార్యక్రమాలు, వాటి విజయాలు--వైఫల్యాలను లోతుగా అధ్యయనం చేసి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఒక సూక్ష్మ, ఆచరణాత్మక, ఫలితాల ఆధారిత ప్రణాళికను రూపొందించడం జరిగిందన్నారు.ఈ ప్రణాళిక యొక్క ప్రధాన ఉద్దేశ్యం కేవలం మొక్కలు నాటడమే కాకుండా, నాటిన ప్రతి మొక్క సజీవంగా పెరిగి వృక్షంగా మారే వరకు అవసరమైన బాధ్యతలు, సంరక్షణ చర్యలు, పర్యవేక్షణ విధానాలు, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలను వ్యవస్థీకృతంగా అమలు చేయడమేనని వివరించారు.గ్రంథాన్ని స్వీకరించిన అనంతరం తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు అంకితభావంతో రూపొందించిన ఈ సమగ్ర ప్రణాళిక అభినందనీయమని పేర్కొన్నారు. నందిగామ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ కార్యాచరణ పథకాన్ని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి, ఆచరణ సాధ్యమైన అంశాలను దశలవారీగా అమలులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు."హరిత నందిగామ" లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యతను స్వీకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, నందిగామ మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం, కేంద్ర మంత్రులను కలిసిన సొసైటీ అధ్యక్షులు ఉమ్మనేని పుల్లారావు

**పెనుగంచిప్రోలు,జూన్ 6 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం ముళ్లపాడు గ్రామ పిఏసిఎస్ సొసైటీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉమ్మనేని పుల్లారావు శనివారం రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ను కేంద్ర పౌర శాఖ విమాన శాఖ మంత్రి కింజవరపు రామ్మోహన్ నాయుడులని మర్యాదపూర్వకంగా కలిసి వారికి అభినందనలు తెలియజేసిన్నారు. ముల్లపాడు పీఏస్సీఎస్ అధ్యక్షులు ఉమ్మినేని పుల్లారావు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ముళ్ళపాడు గ్రామ ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు..





Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188